ఆయుర్వేదాచార్య
శిష్టా సుబ్రహ్మణ్యశాస్త్రిగారి
పూర్ణచంద్రోదయం
తులం 1-కి రు. 20-0-0
(బంగారు భస్మం విడిగా యివ్వబడును.)
వసంతకుసుమాకరం
తులం 1 కి రు. 25/- 300 విధములగు
ఆయుర్వేదౌషధములు దొరకును.
ఆంధ్రరత్న ఆయుర్వేదనిలయం,
బ్రాడీపేట — గుంటూరు.

ఆంధ్రపత్రిక.

రేడియో
(తెలుగుపుస్తకం రూ 0-4-9)
రేడియోలు, బ్యాటరీ రేడియోలు
దొరకును.
విక్టరీ స్టోర్సు,
మెయిన్, బజారు - గుంటూరు.
లౌడ్ స్పీకర్లు అద్దెకు దొరకును.

316775

The Andhra Patrika, Madras, } Regd No 1118 Vol 34 No 5 SATURDAY 5th APRIL 1947 వెల ఒకఅణా {Founder K. Nageswara Rao

"రాజ్యాంగపరిషత్తుద్వారా రాష్ట్రం రాకుంటే సత్యాగ్రహం"

దౌర్జన్యంద్వారా పాకిస్తాన్ లభ్యం కాదు

ముస్లింలీగ్ అధ్యక్షునికి సర్దార్ పటేల్ సమాధానం

అహమ్మదాబాద్, ఏప్రిల్ 3: పాకిస్తాన్ కంగీకరించి లీగుతో "యుద్ధ విరమణ సంధి" చేసుకోవలసిందని జాబాబ్ జిన్నా గతవారం బొంబాయిలో చేసిన ఉపన్యాసానికి, తాత్కాలిక ప్రభుత్వ గృహశాఖా సభ్యుడున్నూ, కాంగ్రెసు కార్యవర్గ సభ్యుడున్నూ అయిన సర్దార్ వల్లభాయ్ పటేలు ఇవాళ సమాధానం ఇచ్చాడు. సర్దార్ పటేలు నగర కాంగ్రెసు కార్యవర్గ అధ్యర్యాన నేటి సాయంత్రం అహమ్మదాబాదులో జరిగిన మహాజన సమావేశంలో ఉపన్యసిస్తూ పాకిస్తాన్, సిద్ధాంతం ఒక పెద్ద నవ్వులాట అనీ, కేవల శిశుభేల అనీ, వర్ణించాడు.

"పాకిస్తాన్‌ను న్యాయ్యమార్గాన సంపాదించడానికి వీలవుతుందేమో గాని కత్తితో బలప్రయోగంద్వారా మాత్రం సాధించడం అసంభవం." సర్దార్ పటేలు ఇలా దాదాపు 60 నిముషాలసేపు ఉపన్యసించాడు:—

భారతదేశానికి చాలా విషమమైన విప్లవదినాలు. ఆసేతు సంవత్సరాలపాటు అష్టకష్టాలుపడి అసంఖ్యాకమైన ఆత్మత్యాగాలు చేసినతరువాత ఎట్టకేలకు మనం స్వాతంత్ర్యాన్ని సమీపించాము.

కాంగ్రెసుయొక్క లక్ష్యం సఫలీకృత సమయం ఆసన్నమైంది.

స్వతంత్రజాతిగా భారతదేశం నిర్వహించవలసిన బాధ్యతలను మనం గుర్తించని పక్షంలో, మళ్లీ మనకు మన వెనకటి దాస్యపురోజులు, రాకతప్పవు. 1948 వ సంవత్సరం జూన్ నెలకి భారతదేశంనుంచి వైదొలగుతామని బ్రిటిషు ప్రభుత్వం కావించిన నూతన ప్రకటనవల్ల, కాంగ్రెస్ 1942 ఆగస్టులో చేసిన క్విట్ ఇండియా తీర్మానం త్వరలోనే సఫలీకృతం కానున్నది.

1944 లో జైలునుంచి విడుదలై వచ్చి వతర్వాత తానుచేసిన ఉపన్యాసాలను గుర్తుకు తెచ్చి, పటేలు ఇలా అన్నాడు: భారతదేశం వదిలిపెట్టి పోతామని బ్రిటిషువారు కావించిన ప్రకటన చిత్తశుద్ధితో చేసిందికాదని చాలామంది అప్పుడు అనుమానించారు. కాని ఆరు నూరు అయినా నూరు ఆరు అయినా, ఫలానా తేదీలోగా భారతదేశంనుంచి వైదొలగుతామని అసందిగ్ధంగా ప్రకటించి బ్రిటిషువారు ఈనాడు తమ ఆత్మగౌరవాన్ని చిత్తశుద్ధినీ ప్రపంచానికి ఋజువుచేశారు. బ్రిటిషువారు యెప్పటికైనా భారతదేశాన్ని విచ్ఛిన్నంగా వదిలిపెట్టి పోవడం తటస్థిస్తుందా అని ప్రజలను వేధిస్తున్న అనుమానం అమాత్యత్రయ ఆగమనంతోనూ, తాత్కాలిక ప్రభుత్వ నిర్మాణంతోనూ చాలవరకు నివృత్తి అయిపోయింది. దరిమిలాను 15 నెలలలోగా దేశాన్ని వదిలిపెట్టి పోతామని

(4 వ పేజీ చూడుడు)

పసిఫిక్ దీవులపై అమెరికా ధర్మకర్తృత్వాధికారం

అంగీకరిస్తూ సమష్టిరాజ్య సమితి నిర్ణయం

న్యూయార్క్, ఏప్రిల్ 3: మొన్నటి యుద్ధంలో జపానుమండే లాక్కొన్న పసిఫిక్ దీవులన్నింటిపైనా, అమెరికా సంపూర్ణమైన ధర్మకర్తృత్వాధికారాన్ని ఫలాయించడానికి అంగీకరించే ఒడంబడికను గతరాత్రి సమష్టిరాజ్యసమితి ఆమోదించింది. ఈపసిఫిక్ దీవులు రాజకీయంగా అత్యంత ప్రధాన కీలక స్థావరాలు. ఈ ధర్మకర్తృత్వాధికార ఒడంబడికను అమెరికా సెనెట్ ఆమోదించినపిమ్మటనులు లోకి వస్తుంది.

ఈ దీవులను బలీయమైన సైనిక స్థావరాలుగా నిర్మించే హక్కుగూడా అమెరికా సాధించింది. అక్కడ సైనిక, నౌకా, వైమానిక కార్యాలయాలను నెలకొల్పి, సైన్యాలను ఉంచేహక్కు అమెరికా పొందింది. ఈ దీవులలో సెయిపాన్, టినియాన్, ట్రిక్, ఎక్యూటిక్ క్వాజ్ లెయిన్, మజూరో మున్నగునవి గూడా ఉన్నాయి.

ఈ ఒడంబడికలో జిరూటీనన్నా దీవులు చేర్చబడలేదు. పూర్వ జపాను సామ్రాజ్యంలో యీ దీవులుగూడ ఒక భాగము.

ఆంధ్రమహాసభ ప్రత్యేక సమావేశాలకు కార్యవర్గ తీర్మానం

దేశోద్ధారక మహల్‌లో ప్రకాశంగారిచే మహాసభ ప్రారంభోత్సవం

చెన్నపురి, ఏప్రిల్ 4: శ్రీ దేశోద్ధారక మహల్‌లో ప్రత్యేకాంధ్రమహాసభ ఈ సాయంత్రం మూడు గంటలకు వుయ్యూరు కుమారరాజాగారి అధ్యక్షతను జరిగింది. సభను శ్రీ ప్రకాశంపంతులుగారు ప్రారంభించిరి.

ఆహ్వాన సంఘాధ్యక్షులు కర్లపాటి అప్పారావుగారు ప్రతినిధులకూ ప్రేక్షకులకు స్వాగతం చెప్పారు. ఉదయం శ్రీ కడప రామసుబ్బమ్మగారు ఆంధ్రపతాక ప్రతిష్ఠాపనోత్సవం జరిపారు. ఊరేగింపులపై నిషేధం ఉన్నందున అధ్యక్షుని ఊరేగింపు ఉత్సవాన్ని విరమింపవలసి వచ్చింది.

ఆంధ్ర పతాకోత్సవం

మదరాసు, ఏప్రిల్ 4: ఈ దినం మదరాసు పేపేరియందు నెం. 84 పిడెన్ హోము రోడున నిర్మించబడిన దేశోద్ధారక హాలు ఆవరణలో ప్రత్యేక ఆంధ్ర మహాసభా సందర్భమున ఉదయం 9 గంటలకు ఆంధ్ర పతాకోత్సవం జరిగింది.

మహాసభాధ్యక్షులు, శ్రీ ఉయ్యూరు కుమారరాజా, ఆహ్వాన సంఘాధ్యక్షుడు శ్రీ కె. అప్పారావు, ఉపాధ్యక్షులు, రాయలసీమ కేసరి శ్రీ గుడుతూరు తిమ్మప్ప శ్రేష్ఠి, శ్రీ అరవపల్లి వెంకట్రావు, శ్రీయుతులు కే. కోటిరెడ్డి, రాజా పెద్ద సుబ్బరాయశెట్టి, యస్. రాజగోపాలశెట్టి రాజామురళీ కృష్ణరావు, నరసింహదేవర సత్యనారాయణ, కవిసార్వభౌమ శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, భావరాజు వెంకట కృష్ణరావు, గిడుగు సీతాపతి మోతే నాగాయణరావు, యం. యల్. సి. గోవా సీతారామస్వామి యం. యల్. ఏ. జి. వి. పున్నయ్యశాస్త్రి, ప్రభల వెంకట్రామయ్య వింజమూరి వరసింహారావు, శంగదాల వెంకటేశ్వరులు, తట్టా రాఘవాచార్యులు వై. మాధవాచార్యి, పి. యల్. యస్. శర్మ, తాళ్ళూరి సుబ్బరావు, పొన్నేరి రామకృష్ణయ్య, సయ్యద్ అహ్మద్ సాహేబు, వడ్లమన్నాటి దాసాంజనేయరావు బి. యస్. శర్మ, మంగాచారి ప్రభృతులు పతాకోత్సవమునకు విచ్చేశారు. ప్రకటించిన ప్రకారం చెన్నపురి ఆంధ్రమహాసభ హాలునందు దేశోద్ధారక హాలుఆవరణ పెద్ద ఊరేగింపు జరుగకపోయినూ, ప్రతినిధులు, ప్రేక్షకులు మున్నగువారందరూ ఆంధ్రమహాసభకుండి బయల్దేరి సభాస్థలానికి వచ్చారు.

డి. రాధాబాయి అను కన్య ఆంధ్ర పతాకగీతమును మొదట పాడినమీదట శ్రీ నరసింహదేవర సత్యనారాయణగారు వేదపఠనం చేశారు. అనంతరం శ్రీ కొంపెల్ల సోమయాజులుగారు యింపుగా జాతీయ గీతమును పాడారు.

పతాకోత్సవం

శ్రీ తట్టా రాఘవాచారిగారి కోరికపై శ్రీమతి కడప రామసుబ్బమ్మగారు ఆంధ్ర పతాకాన్ని ఎగురవేసి యీ క్రిందివిధంగా ఉపన్యసించారు:

నేడు చెన్నపురియందు ప్రత్యేక ఆంధ్ర మహాసభకు సమావేశపరచడంలో ప్రత్యేక ప్రాముఖ్యం కలదని నేను తలుస్తున్నాను. ఈ మహాసభ సందర్భమున ఆంధ్ర పతాకోత్సవం జరుప నాకు అవకాశమిచ్చినం

(2 వ పేజీ చూడుడు)

మెడగాస్కర్ ప్రజావిప్లవం

సమసిపోయిందని రమాడియర్ ప్రకటన

ప్యారిస్, ఏప్రిల్ 3: "ఈ వారారంభంలో దేశీయుల తిరుగుబాటుఫలితంగా ప్రజ్వరిల్లిన మెడగాస్కర్ ప్రజావిప్లవం సమసిపోయిందనీ, ద్వీపమంతటా శాంతిభద్రతలు నెలకొన్నాయి"అని ఫ్రెంచి ప్రధాని పాల్ రమాడియర్ యివ్వాళ పత్రికావిలేఖరుల సమావేశంలో ప్రకటించాడు.

"మెడగాస్కర్ పరిస్థితినిగురించి అంతర్జాతీయ ఆందోళన పడనవసరంలేదు. ఏవో స్వసైనికచర్యలవల్ల నైతికసం ఒకరుపాకినుండు కూడ ప్రయోగించకుండానే, ద్వీపమంతటా శాంతిభద్రతలు నెలకొల్పబడినాయని అల్‌గ్రేడినుంచి తాజాగా వచ్చేవార్తలవల్ల తెలుస్తోంది. ఏవో కొన్ని ప్రదేశాలలో తాత్కాలికంగా మార్షల్ లా ప్రకటించబడినప్పటికి ద్వీపమంతటా మార్షల్ లా అమలుజరుపవలసిన అవసరం కనిపించడం లేదు. ఈ తిరుగుబాటులో పాల్గొన్న దేశీయులు కత్తులు, ఈటెలు ఉపయోగించారు. తిరుగుబాటుకు మూలమైన కొంతమందిని అరెస్టు చేయవలసిందిగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది,"

మెడగాస్కర్‌వట్ల ఫ్రెంచిప్రభుత్వం కనుపరుస్తున్న విధానం, చతుష్పక్ష సంకీర్ణ మంత్రివర్గంలో మళ్లీ కలతలకు దారితీయవచ్చు. మెడగాస్కర్ జాతీయ విప్లవాన్ని విచ్ఛిన్నం చేయాలని సోషలిస్టు పార్టీకి చెందిన, మేరియస్ మూటెట్ (ఫ్రెంచి వలసరాజ్యశాఖామాత్యుడు) కోరిక. కాని మెడగాస్కర్ జాతీయ స్వాతంత్ర్యోద్యమాన్ని నిర్మూలించడానికి కమ్యూనిస్టులు ప్రతిఘటన ప్రదర్శిస్తున్నారు.

మెడగాస్కర్ తిరుగుబాటును గూర్చి విచారించ వలసిందిగా జనరల్ బార్జినిస్‌ను మూటెట్ నియమించాడు. సైనికదృష్ట్యా, యీ తిరుగుబాటుకు కారణమేమి, యిందుకు బాధ్యులెవరు, ద్వీపంలో ఫ్రెంచి ప్రజల భద్రత నెలా కాపాడాలి యిందుకేయే చర్యల నవలంబించాలి యీ మున్నగు విషయాలను బోర్జినిస్ విచారించి ఫ్రెంచి ప్రభుత్వానికి నివేదించారట.

కార్తికమంత్రుల సభ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3: వివిధరాష్ట్రీయ కార్తికశాఖామాత్యుల సమావేశం యీనెల 16, 17 తేదీలలో ఢిల్లీలో జరుగుతుంది.

గాంధిజీతో అయిదురోజుల సంప్రతింపుల తరువాత జిన్నాగారితో వైస్రాయి సంభాషణ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: గాంధిజీ వైస్రాయి మౌంట్‌బాటెన్ తిరిగి ఈరోజు అపరాహ్ణం 2 గంటలప్రాంతాల కలుసుకుంటున్నారు. నిన్నటి దాదాపు అదే సమయానికి గాంధిజీ వైస్రాయి భవనానికి వెళ్లారు. సాయంత్రం 4-30 వరకూ సంభాషణలు సాగినవి. నిన్నను గాంధిజీ వెంట వైస్రాయిభవనానికి అరుణఆసఫ్‌అలీ వెళ్లింది.

మహాత్ముడు మరో నాలుగైదు రోజులు ఢిల్లీలో ఉంటారనీ, వైస్రాయిని మళ్లీ, మళ్లీ కలుసుకొంటూ ఉంటారనీ తెలుస్తున్నది. జిన్నాగారీరోజే వైస్రాయిని మొదటిదఫా కలుసుకొంటారు. నిన్నసాయంత్రం కాంగ్రెస్ అధ్యక్షుడు కృపలానీ కార్యవర్గసభ్యులు కొందరు గాంధిజీని కలుసుకొని సంభాషించారు.

గాంధి—మౌంట్‌బాటెన్ సంప్రతింపులు ఇష్టాగోష్ఠిగానే జరుగుతున్నదనీ, వాటిని రాయబారాలుగా పరిగణించడం, భావ్యంగాదనీ రాజకీయజ్ఞులు అంటున్నారు. ఉభయులూ దాపరికంలేకుండా అన్ని విషయాలూ మాట్లాడుకుంటున్నారు. ఒకరిధోరణిని మరొకరు అర్థం చేసుకొనడానికి ఈ సంభాషణలు ఉపయోగపడుతున్నవి. ప్రస్తుత విషయాల నేమీ వీరు చర్చించడంలేదనీ ఫిబ్రవరి 20 ప్రకటనను ఎంత శీఘ్రంగా సాధ్యమగా అమలుజరపడానికి వీలుంటుందనే విషయాన్నే వీరు చర్చిస్తున్నారనీ తెలుస్తున్నది. అంచేత తాత్కాలిక ప్రభుత్వంలో ముస్లింలీగ్ ఉండటమా లేదా అనే విషయమై వీరు సంప్రతింపులు జరుపుట లేదని ఎంచవలసి వస్తున్నది.

గాంధిజీ సంభాషణ ముగిసిన తరువాత ఈ సాయంత్రం 5-30 కు జిన్నాగారు వైస్రాయిని కలుసుకుంటారు. రాజ్యాంగ పరిషత్తు ఏప్రిల్ 28 న సమావేశమౌతున్నందున జిన్నా-మౌంట్‌బాటెన్ సంప్రతింపులకు ఒక ప్రత్యేక ప్రాముఖ్యతఉంది.

గాంధి-మౌంట్‌బాటెన్, సంప్రతింపుల గతిని ఎవ్వరూ చెప్పలేకుండా ఉన్నారు. కాని కాంగ్రెస్ వర్గాల్లో విచారించగా వీరి సంప్రతింపులు ఈ క్రింది విషయాలకు సంబంధించి జరిగిఉండవచ్చునని తెలుస్తున్నది.

(2 వ పేజీ చూడుడు)

సైనికవ్యయం తగ్గింపు

బల్దేవ్‌సింగ్ హామీ

గురువారం కౌన్సిల్ ఆఫ్‌స్టేట్‌లో జి. యస్. మోతీలాల్‌గారు భారత ప్రభుత్వ సైనిక వ్యయాన్ని తగ్గించాలని కోరుతూ ప్రతిపాదించిన తీర్మానంపై మాట్లాడుతూ రక్షణశాఖాసభ్యుడు సర్దార్ బల్దేవ్ సింగ్ గారు సాధ్యమైనంతవరకూ, వీలున్నంత వరకూ ఈ ఖర్చును ఇంకా తగ్గిస్తామని హామీ ఇచ్చారు.

సమగ్రభూమిశాసనం

ప్రాతినిధ్య సంస్థల సంప్రదింపులు

గవర్నరుతో రెవెన్యూమంత్రి ఆలోచన

చెన్నపురి, ఏప్రిల్ 4: రైతుక్షేమానికి సమగ్రశాసనం చేసి సందర్భంలో రెవెన్యూ మంత్రి గౌ॥ కళా వెంకట్రావుగారు అభిప్రాయాలను తెలుపవలసిందిగా ప్రతిపక్షనాయకులకు, శాసనసభ్యులకు, జిల్లాకాంగ్రెసు సంఘాల అధ్యక్షులకూ, ఆంధ్ర తమిళ కిసాను కాంగ్రెసు అధ్యక్షులకూ, భూస్వాముల అసోసియేషన్లకూ ప్రొ॥ రంగాగారికీ, రాజమండ్రి ఆంధ్రప్రజా వ్యవహార సంస్థవారికి, ఇతర అనధికార ప్రముఖులకు కొందరికి వ్రాసినారు.

రెవెన్యూబోర్డు రద్దు విషయము రెవెన్యూ మంత్రిగారు తీవ్రముగానే ఆలోచించుచున్నారు. రద్దును ఉపసంహరించుకున్నారని కొన్నిపత్రికలు ప్రకటించిన మాట అబద్ధము.

భూమిశాసనాన్నిగూర్చి 45 నిముషాలపాటు రెవెన్యూమంత్రిగారు నిన్న గవర్నరుగారితో సంప్రదించారు.

సరిహద్దు రాష్ట్రంలో ముస్లింలీగ్ కార్యకలాపాలు

మతద్వేషపూరితమనిఖాన్ సాహెబ్

పెషావరు, ఏప్రిల్ 3: "సరిహద్దు రాష్ట్రములో ముస్లింలీగువారు సాగించుచున్న ఉద్యమము శాంతియుతమయినది కాదు. దౌర్జన్యవిరహితమైనది కాదు, రాజకీయమును కాదు, కేవలము మతద్వేషపూరితమైనది" అని సరిహద్దురాష్ట్రప్రధాని డా॥ ఖాన్ సాహెబుగారు నేడిచ్చిన పత్రికాప్రతినిధులసభలో ప్రసంగించుచు చెప్పిరి. పచ్చయూనిఫారములు ధరించుచుండిన ముస్లిమ్‌లీగర్లు రైళ్లలో ప్రయాణముచేయుచుండిన హిందువులపైనను, మహమ్మదీయులపైనను అత్యాచారములు గావించుట యిందుకు నిదర్శనమని ఆయన చెప్పెను. నిన్న కొహాట్ నుండి రావల్‌పిండికి బయలుదేరిన రైలులో ముస్లిమ్‌లీగువారి అత్యాచారములవల్ల హిందూ సిక్కు మతములకు చెందినవారు 6 గురు మరణించిరని 5 గురు తీవ్రముగా గాయపడిరని, 8 గ్గురు స్వల్పముగా గాయపడిరని, 15 మంది స్త్రీలు, పిల్లలు, పురుషులు కనబడుటలేదని ఆయన చెప్పెను.

డా॥ ఖాన్ సాహెబుగారు ఈప్రకటన చేయుచుండిన సమయమున పెషావరునగరములో గుండుదెబ్బలవల్ల ఒక సిక్కుకు గాయములు తగిలెనని టెలిఫోనువార్త

వచ్చెను. ఈవిషయమును ప్రధాని పత్రికా ప్రతినిధులకు తెల్పి సరిహద్దులో లీగువారి ఉద్యమము మతద్వేషపూరితమైనదనుట కిది మరియొక నిదర్శనమని చెప్పిరి. కొందరనునట్లు లీగువారి ఉద్యమము మతముతో సంబంధము లేనిదిగాను, దౌర్జన్యవిరహితమైనదిగాను వుండవలెనని లీగు మహానాయకులు ఉత్తరువులు చేసినప్పటికి ఆ ఉత్తరువులను సరిహద్దురాష్ట్రీయులందలి లీగు అనుయాయులు శిరసావహించుటలేదని డా॥ ఖాన్ సాహెబుగారు రనిరి.

స్వతంత్ర భారతదేశంతో బ్రిటన్ చేసుకొనగోరు ఒడంబడిక

లండన్, ఏప్రిల్ 3: "1948 జూన్ మాసాంతానికి భారతదేశంనుంచి తాము సంపూర్ణంగా వైదొలగుతామని బ్రిటిషు ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించడంచేత, బ్రిటనును మిత్రదేశంగా పరిగణించి, భారతదేశం బ్రిటిషు ప్రభుత్వంతో సైనిక ఒడంబడిక చేసుకొంటుంది అని ఒక ప్రముఖ కాంగ్రెసునాయకుడు యిటీవల ఒక ప్రకటన చేసినట్లుగా భారత వార్తాపత్రిక ప్రచురించింది. ఈ వార్త ప్రచురణ ఫలితంగా లండన్ రాజకీయవర్గాలలో తీవ్ర సంచలనం యేర్పడింది." అని రాయిటర్ రాజకీయవిలేఖరి ఫ్రేజర్ వైటన్ వ్రాస్తున్నాడు. కాని, యిప్పుడు వైస్రాయి లార్డు మౌంటుబాటెన్‌కు, మహాత్మా గాంధీ, నెహ్రూకు మధ్య జరుగుతున్న రహస్య రాయబారాలకు, యీ సైనిక ఒడంబడికకు ముడిపెట్టడానికి యీ వర్గాలు సాహసించలేకుండా ఉన్నాయి. ఈ రహస్య రాయబారాలు ఏ ఫక్కీలో, ఏ విషయాలపై నడుస్తున్నాయో ఈ వర్గాలు ఊహించలేకుండా ఉన్నాయి. భారత ప్రజానాయకులతో వైస్రాయి సాగించే సంభాషణల పైనంప్రభుత్వాధికారవర్గాలు బయటకు పొక్కనీయకుండా మూకీభావం వహించియున్నప్పటికి, యివి, యావద్భారతదేశ పరిపాలనా బాధ్యతను సంపూర్ణంగా ఒకపక్షం చేతుల్లో పట్టడమా? లేక వివిధపక్షాలచేతుల్లో పెట్టడమా అనే ముఖ్యవిషయానికి సంబంధించి ఉంటాయని ఊహిస్తున్నారు.

అధికారాన్ని సంపూర్ణంగా భారతీయులపరం చేసే క్రమంలో యేదో ఒక ఘట్టమందు, పరస్పర క్షేమాన్ని, లాభాన్ని దృష్టిలో పెట్టుకొని భారతదేశం బ్రిటనుతో ఒడంబడిక చేసుకొంటుందనీ, యీ ఒడంబడిక బ్రిటను భారతదేశాలకు సంబంధం సమస్త విషయాలనేకానికి సంబంధించి ఉంటుందని భావిస్తున్నారు. ప్రపంచశాంతి పరిరక్షణా సాధనంగా, సువిశాల దృక్పథంతో, బ్రిటనుతో సన్నిహిత మిత్రుడులాగా ఉండాలనే భారతదేశంయొక్క ఆకాంక్ష, ఆశయము అని భావిస్తున్నారు.

భారతదేశంనుంచి వైదొలగిపోతామంటు స్పష్టంగా బ్రిటిషుప్రభుత్వం తేదీనిగూడా ప్రకటించిన కొద్దికాలానికే, రాజకీయంగా అత్యంత ప్రధాన కీలకమైన యీ సైనికపుటొడంబడిక కుదిరి బయటపడితే, ఆశ్చర్యజనకంగా ఉండకతప్పదు.

ఆంధ్రమహాసభ అధ్యక్ష, ఆహ్వాన సంఘాధ్యక్ష ఉపన్యాసములు విడిగా 2, 4 పేజీలలో ప్రకటింపబడినవి.

ఢిల్లీకి జిన్నారాక

న్యూఢిల్లీ, ఏప్రిల్ 4: ముస్లింలీగు అధ్యక్షుడు జిన్నాగారు విమానంలో ఈ ఉదయం బొంబాయినుంచి బయలుదేరి మధ్యాహ్నానికి ఢిల్లీ చేరారు.

ఢిల్లీకి బయలుదేరేముందు కొంతమంది విలేఖరులు బొంబాయిలో వేసిన ప్రశ్నకు జిన్నాగారు "ఈసాయంత్రమే వైస్రాయిని చూసేదీ, చూడందీ చెప్పలేను" అని సమాధానం చెప్పారు.

లాహోరు ఏప్రిల్ 3: వర్గసంక్షోభములో చనిపోయినవారు 2090 మంది అనిన్నీ తీవ్రమయిన గాయాలు అయినవారు 1100 మంది అనిన్నీ తెలుస్తూఉంది. ప్రభుత్వమువారికి ఇంకా సరిఅయిన అంకెలు తెలియలేదనిన్నీ ఆయా అంకెలను పోగుచేస్తున్నారనిన్నీ తెలుస్తూ ఉంది.

ధాన్యం ధరను పెంచుటకు రాష్ట్రప్రభుత్వం ఆలోచన

చెన్నపురి, ఏప్రిల్ 4: మద్రాసు ప్రధాని ఓమందూరు రామస్వామిరెడ్డి, శ్రీ కళా వెంకట్రావు, డా॥ రాజన్, కల్లూరి చంద్రమౌళి, మాధవమీనన్‌గారలు నిన్న సాయంత్రము సమావేశమై ఉత్పత్తి వినియోగదారుల సహకార సంఘాలనుగూర్చి ధాన్యం ధర హెచ్చించటాన్ని గూర్చి చర్చించారని తెలుస్తోంది.

ధాన్యంధర బస్తాకి దాదాపు రూపాయివరకూ పెంచవచ్చునని తెలుస్తోంది.

డైరక్టర్ల ఎన్నిక, ధాన్యంధర హెచ్చింపు, వరిసాగుకు, ఉత్పత్తిని పెంచడానికి ద్రవ్యసహాయమూ, ఆలోచించారు.

సంఘంపనుల ప్రారంభం

సహకార వినియోగదారుల సంఘాలకు డైరక్టరులు ఎన్నిక అయ్యేదాకా ప్రధాన అవసరద్రవ్యాల చిల్లర పంపకాన్ని అప్పచేసే విషయాన్నిగూర్చి ఆలోచించారు. ఋణసౌకర్యాలు రైతులకు ఇచ్చేవిషయం ఆలోచించారు. సహకార బ్యాంకు ఒక కోటి ఋణం ఇచ్చేవిషయం ఆలోచించి ఋణం ఇవ్వడానికి అనుకూలంగా మంత్రులు ఉన్నట్లుగూడా తెలుస్తోంది.

ఈ విషయాలన్నిటినీ పర్యావలోకన చేస్తూ, ఉత్తర్వులు వేస్తూ వచ్చే సోమవారంనాటికి ఒకప్రకటన రావచ్చు.

గాంధిజీతో నెహ్రూ సంప్రతింపులు

గురువారం మధ్యాహ్నం పండిట్ నెహ్రూ గాంధిజీతో దాదాపు ఒకగంట సేపు సంప్రతించారు. తరువాత ఆచార్య కృపలానీగారు గాంధిజీని కలుసుకున్నారు.

గంటల పంచాంగం

సర్వజిత్ సం॥ చైత్ర శు॥ పూర్ణిమ
1947 సం॥ ఏప్రిల్ 5 శనివారం
శు॥ పూర్ణిమ రా 8-59 వాస్త రా 11-34
వర్జ్యం ఉ 8-1 ల 9-37 కు.
బు॥ ప్రథమ ఏప్రిల్ 6 ఆదివారం
ఆ॥ ప్రథమ రా 8-41 చిత్రరా 12-0 వర్జ్యం
ఉ 7-42 ల 9-20 కు.

ఆంధ్రపత్రిక
సర్వజిత్ సం॥ చైత్ర శు॥ పూర్ణిమ
శనివారము

ఆజాద్ హిందుఫౌజు ఖైదీలు

కోర్టుమార్షల్ విచారణలలో శిక్షవిధింపబడి, ప్రస్తుత మా శిక్షల ననుభవించుచున్న ఆజాద్ హిందుఫౌజు ఖైదీలను విడుదల చేయుట అవసరమను ఆందోళన సాగుచున్నది. వీరిలో ముఖ్యముగ ఏడుగురు ఖైదీలు 14 సంవత్సరముల మొదలు రెండు సంవత్సరములవరకు పరిమితి గల కారాగారశిక్షల ననుభవించుచున్నారు.

కేంద్రమున ప్రజాప్రతినిధుల ప్రభుత్వము పనిచేయుచున్న ఈ సమయమున వీరివిడుదల సులభ సాధ్యమని భావించుట సహజమే. దానిని ఎవరునూ కాదనజాలరు. కెప్టెన్ షానవాజ్, సెహగాల్ మొదలైన ఆజాద్ హిందుఫౌజు ఉద్యోగులపై కోర్టుమార్షల్ విచారణ జరిగినపుడు, కీర్తిశేషుడు భూలాభాయి దేశాయిగారి నాయకత్వమున 'డిఫెన్సు'ను ఏర్పాటు చేసి కాంగ్రెస్ ప్రధాన భూమికను నిర్వహించినది. వారి విడుదల ద్వారా అఖండ విజయమును సాధించి, ప్రపంచ ప్రశంసను పొందినది. యావద్భారతదేశము కాంగ్రెస్ చేసిన మహత్తరమైన సేవను హర్షించినది; హర్షించుచున్నది.

ప్రస్తుతము కారాగార శిక్ష ననుభవించుచున్న భారతజాతీయ సైనిక ఖైదీల విషయమున కేంద్ర ప్రభుత్వము ఎంతశ్రద్ధ వహించియున్నది, కేంద్రశాసనసభలో మొన్న వీరి విడుదలను గురించి ప్రతిపాదించిన అనధికార తీర్మానముపై పండిట్ నెహ్రూ చేసిన సమగ్ర ప్రకటనవల్లనే స్పష్టపడుచున్నది. ఈ ఆజాద్ హిందుఫౌజు ఖైదీలనుగురించి కేంద్రప్రభుత్వము భారత సర్వసేనానితో సంప్రతించగా, ఆయన వీరి విడుదల వాంఛనీయమైనది కాదనియు, విడుదల చేసినచో సైన్యమున క్రమశిక్షణ సూత్రములకు భంగము కలుగుననియు, తత్కారణముగ అనేక విషఫలితము లేర్పడవచ్చుననియు సలహా ఇచ్చినట్లు కేంద్రప్రభుత్వ ఉపాధ్యక్షుడు నెహ్రూ తెలియజేయుచున్నాడు. ఆనాడు ఆజాద్ హిందుఫౌజు భారతదేశమున పనిచేయుచున్న బ్రిటిషుసామ్రాజ్య ప్రభుత్వముపై దేశభక్తిని పురస్కరించుకొనియే దండయాత్ర సాగించినది. మాతృదేశ స్వాతంత్ర్య స్థాపన నుద్దేశించిపరరాజులపై యుద్ధముచేయుట అపరాధముకాదని ఏనాడో నిర్ణయమైనది. సాధారణ సైన్యమర్యాదలను పాటించక అమానుషమైన, అతి కిరాతక కృత్యములను జరిపిరను నేరమునకే ఆజాద్ హిందుఫౌజు సైనికులలో కొందరికి శిక్షలు విధింపబడినవి.

ఈ ఖైదీల విడుదల సమస్యను అతి సులభముగ పరిష్కరించవచ్చునని కేంద్ర ప్రభుత్వము మొదట అభిప్రాయపడినట్లునూ, సమగ్రమైన పరిశీలన చేసినమీదట అనేక క్లిష్టవిషయములు తమకు గోచరమైనట్లును నెహ్రూ చెప్పుచున్నాడు. కేంద్రమున ఇప్పుడున్న ప్రభుత్వము వెనుకటి ప్రభుత్వములమాదిరిగ బాధ్యతారహితమైనట్టిది కాదు. ఏ సమస్య ఉత్పన్నమైనను దానిని సమగ్రముగ పరిశీలించి మంచి చెడ్డలను గ్రహించిన మీదటగాని ఒక నిర్ణయమునకు రాదని నమ్మవలసియున్నది.

ప్రస్తుతము కారాగార శిక్షల ననుభవించుచున్న ఆజాద్ హిందుఫౌజు ఖైదీల విషయమును, వారికి కోర్టుమార్షల్ విచారణలో విధించిన శిక్షలను సాకల్యముగ పరిశీలించి, ఆ శిక్షలను ఏవిధముగనైన మార్పుచేయుటకు, సవరించుటకు అవకాశమున్నదేమో తెలుపవలసినదని ఫెడరల్ కోర్టు న్యాయమూర్తుల అభిప్రాయమును, సలహాను కేంద్ర ప్రభుత్వము తీసికొని నిర్ణయించినట్లు నెహ్రూ ప్రకటించుచున్నాడు. ఇది కేంద్ర ప్రభుత్వము నందున్న సభ్యులందరి ఏకగ్రీవామోదముతో జరిగిన నిర్ణయమనికూడా స్పష్టపడుచున్నది. ఆజాద్ హిందుఫౌజు సైనికులకు సహాయము చేయు విషయమున కాంగ్రెస్ ప్రముఖుల చిత్తశుద్ధిని శంకించుట సాహసమే కాగలదు. ఈ ఖైదీల విషయమున కాంగ్రెస్‌వారు ఇదివరలో చేసియున్న సేవయే ఇందుకు ప్రబలనిదర్శనము. కేంద్రప్రభుత్వము ప్రకటించిన ఈ కొత్తనిర్ణయము అందరి అమోదమును పొందగలదనియు, ఫెడరల్ కోర్టు న్యాయమూర్తులు ఆజాద్ హిందుఫౌజు ఖైదీలనేరములను, శిక్షలను సాకల్యముగ పరిశీలించి తమ నిష్పాక్షికాభిప్రాయములను తెలిపెదరనియు నిస్సందేహముగ ఆశించవచ్చును.

జిన్నా-వైస్రాయి సంభాషణ

(1వ పేజీ తరువాయి)

స్తున్నది. దేశంలోని అంతః కలహాలతో నిమిత్తంలేకనే మే 16 వ తేదీ ప్రకటనకు కట్టుబడి ఆ ప్రకటనను బ్రిటిషుప్రభుత్వం అమలుజరపాలి. రాజకీయ పక్షాల మధ్య విభేదాలున్నవనే కారణంగా అధికారదత్తతలో ఆలస్యం ఉండరాదు. రాజ్యాంగాన్ని తయారుచేయగల రాష్ట్రసంస్థానాల సమితికి అధికారం ఇచ్చివేయవలెను. పంజాబ్, బెంగాల్ విభజన జరగాలనే మరతు ఇందులోనే ఇమిడి ఉంది. సమితిలో చేరని రాష్ట్రాల విషయం విడిగా చర్చించాలి.

జిన్నా మౌంట్‌బాటెన్ సంప్రతింపుల ఫలితంగా విషయాలు నిస్తేరి అ సలు సమస్య బయటపడగలదనీ, నిర్దుష్టమైన ఫలితాలు ప్రాప్తింపవచ్చుననీ అంటున్నారు.

అధికారదత్తత తక్షణం జరగాలనే కాంగ్రెస్ కోరిక విషయమై మౌంట్‌బాటెన్‌కూ కాంగ్రెస్ హైకమాండ్‌కూ సంప్రతింపులు జరుగవచ్చునని తెలుస్తున్నది.

అరబ్ లీగ్ పరిశీలకుడుగా ఆసియా మహాసభకు హాజరైన టాకీ ఉదన్ ఎల్సాఫ్ గారు గురువారం మధ్యాహ్నం గాంధిజీని కలుసుకొన్నారు. తరువాత గాంధిజీనిసరించి మీ అభిప్రాయం ఏమిటని అసోసియేటెడ్ ప్రెస్ విలేఖరి ప్రశ్నింపగా వారిలా చెప్పారు: "ఆ మహానుభావుడ్ని గురించి అభిప్రాయం చెప్పడానికి నేనెంతవాణ్ని? గాంధిమహాత్ముని దర్శనంచేసుకోవాలని ఎంతోకాలంగా కలకరిస్తున్నాను. ఇప్పటికి ఆ కలలు ఫలమైనవి. గాంధిజీకి అరేబియా ప్రత్యేక శ్రద్ధఉంది. అక్కడి పరిస్థితులను నేమ గాంధిజీకి సవిస్తరంగా విన్నవించాను."

"35 ఏళ్లనుంచీ సాగుతున్న కృషి ఫలోన్ముఖమయే తరుణం వచ్చింది"

ఆంధ్రమహాసభ ప్రత్యేక సమావేశం: ఉయ్యూరు కుమారరాజాగారి అధ్యక్షోపన్యాసం

ప్రత్యేకాంధ్ర మహాసభ కధ్యక్షత వహించిన శ్రీ ఉయ్యూరు కొమారరాజాగారీవిధంగా ఉపన్యసించినారు.

భారత రాజకీయములు విశేషముగా పరివర్తన నొందుచున్న సమయమున ప్రత్యేకముగా ఆహ్వానింపబడిన ఈ మహాసభకు అపారమైన ప్రేమాభిమానములతో నన్ను అధ్యక్షునిగా ఎంచుకొనిన తమ ఎల్లరకును కృతజ్ఞతాభివందనము లర్పించెదను.

నిరు డీ రోజులలో గుంటూరులో జరిగిన ఇరువదినాల్గవ ఆంధ్రమహాసభకు పిమ్మట ఈ కొలది కాలములో దేశనాయకప్రముఖులు కొందరు పరమపదించినారు. హైందవ సంస్కృతికి అఖండమైన ప్రోది చేసిన మహనీయుడు పండిత మదనమోహన మాళవ్యాజీ ఈ సందర్భమున ముఖ్యముగా స్మరింపదగినవాడు. ఆధునికాంధ్ర సారస్వత వృద్ధులలో వన్నెకెక్కిన కవి చక్రవర్తి చిలకమర్తి లక్ష్మీనరసింహము గారును; పత్రికా సంపాదకుడుగ, రచయితగ, వాణిజ్య నిపుణుడుగ, చలచిత్ర దర్శకుడుగ, నిర్మాతగ, ఎనలేని ఖ్యాతి గాంచిన సమర్థుడు పరసుడునగు గూడవల్లి రామబ్రహ్మముగారును; ఆంధ్ర నట లోకమునకు అతిమాత్రమును అంతర్జాతీయ యశమును నార్జించిన ఆంధ్రనాటక కళాప్రపూర్ణులు రావుసాహెబు తాడిపర్తి రాఘవాచార్యులుగారును అస్తమించినారు. లక్ష్మీనరసింహముగారు పండుపండిన పెద్దలేగాని వారి లేఖినికిమాత్రము నవకము తలుగలేదు. రామబ్రహ్మముగారిది కేవలము అకాల మరణము. మదరాసు ఆంధ్రులలో వారు లేని లోటు నేడు స్పష్టముగా గోచరించుచున్నది. నాటకకళా ప్రపూర్ణుని యశోధ్వజముగా ఆంధ్రనాటక కళాపరిషత్తు విజయవాడలో 'రాఘవ కళామందిరము' నిర్మింప తీర్మానించి తన ధర్మము లెస్సగా నిర్వహించుచున్నది.

ఏకశేయ బ్రాహ్మణునకు పూర్వము నుండియు అభ్యుదయ పరంపరాభివృద్ధిగ వచ్చుచున్న ఆంధ్రజాతి ప్రాచీన తనుగూర్చిగాని, శాలివాహనునివంటి శకపురుషునిగని, శకనకవర్షములు ఘరిపించిన ఆంధ్రజాతి చరిత్ర ప్రశస్తినిగూర్చిగాని, బోధాయన ఆపస్తంబాది సూత్రకారులను, విద్యారణ్యాది భాష్యకారులను మల్లినాథాది వ్యాఖ్యాతలను, కాటిల్యాది శాస్త్రకారులను, విద్యానాథ పండితరాయాది ఆలంకారికులను కన్న ఆంధ్రజాతి దివ్యధురంధరతను గూర్చిగాని, బండారాంతర విఖ్యాతిగాంచిన ఆంధ్రుల కాకావాణిజ్య సంపదనుగూర్చిగాని, మగధనుండి మధుర తంజావూరుల వరకును, విజయనగరమును నిర్మించి విశాలాంధ్ర సామ్రాజ్యమును పాలించిన ఆంధ్రుల సాహసౌదార్య విక్రమ విశేషములగూర్చిగాని, అజంతా ఎల్లోరా నాగార్జునగిరి అమరావతీ హంపీ విజయనగరాది చిత్రశిల్పముల రచించి నిర్మించిన నాగార్జున జక్కనాచార్యాది మంత్రద్రష్టలగు శిల్పబ్రహ్మలను గన్న ఆంధ్రజాతి శిల్పమహత్వమునుగూర్చిగాని, త్యాగరాయాది వాగ్గేయకారులను గన్న ఆంధ్రజాతి లలితకళావైభవమును గూర్చిగాని; Italian of the East అని పాశ్చాత్యశబ్ద తత్త్వవేదులను పండితులచేతను, 'దేశభాషలందు తెలుగు లెస్స'యని శ్రీనాథాది మహాకవి సార్వభౌములచేతను స్తుతింపబడి, నన్నయ తిక్కనాది కవీశ్వరులగన్న ఆంధ్రభాషాలాలిత్య విలాసములగూర్చిగాని, ఏవంగుణ గణవిశిష్టమైన ప్రాచీనాంధ్రసంస్కృతీ వైభవము నెవ రేవిధముగా ప్రస్తావన చేయబూనినను దానికి భరతవాక్యమనుమాట ఉండదు. పూర్వమును స్మరించుకొన్న ఆంధ్రులకు గర్వకారణము కానిదిలేదు.

ఆంధ్రులకు ఆంధ్రరాష్ట్రము జన్మస్వత్వము. భారతీయులకు స్వరాజ్యమెట్లో ఆంధ్రులకు స్వరాష్ట్రమట్లు. ఇది ఆంధ్రులకే కాదు, అన్నిభాషలవారికిని; భాషాప్రయుక్తములను అన్ని ప్రాంతములవారికిని, దీనికి పూర్వపక్షములేదు. ప్రభుత్వము, కాంగ్రెసు, ప్రజలు ఏకవాక్యముగా దీని నంగీకరింతురు. కాని ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రము ప్రయత్నించిన కొలది దూరమగుచున్నది. బలమునందుగాని, బలగమునందుగాని, ఏ యంశమునందును మనకు సాటిరాని, సింగు ఒరిస్సాలవారికి అందు అయాచితముగ నొకరికి, అల్పప్రయత్న మాత్రమున నింకొకరికి రాష్ట్రములు సిద్ధించినవి. నిజమునకు, మనము ఆంధ్రరాష్ట్రోద్యమము నారంభించునాటికి వారికా చైతన్యమేలేదు. ఎంత తక్కువగా జూచినను ఆంధ్రరాష్ట్రములో చేరదగిన 67,500 చతురపుమైళ్ల విశాలయుగల భూమి, 2½ కోట్ల జనసంఖ్య ఎనిమిదికోట్ల ప్రభుత్వాదాయము, అపారమగు ఆర్థిక ఖనిజసంపద, జలాధారములు కలిగి ప్రత్యేకాంధ్రరాష్ట్రము స్వయం సమృద్ధమని ఋజువుచేయబడినది. భాషాయోగ్యత సామాన్యమైనది కాదని లోకమే గుర్తించినది. ఇవిగాక, ఇంకను కావలసిన సౌకర్యములు సమస్తమును గలవు. అయినప్పటికీ? అంగడిలో నన్నియుగలవు, "అల్లిని నోటనిని" యన్నట్లు ఇన్నియుండియు మనకు రాష్ట్రములేదు. మన తిండి మనము తిని మన బ్రతుకు మనము బ్రతుకుటకు స్వతంత్రత లేదు. మన కష్టమునకు గాని మన సుఖమునకు గాని మనము యజమానులగాము. ఈ దుస్థితికి కారణము మన దురదృష్టమా మన పురాకృతఫలమా లేక మన యసాధారణ ప్రవృత్తిఫలమా చెప్పలేము.

ఇది యిట్లుండ, మన రాష్ట్రవాంఛ పాకిస్థాను వాదముతో ముడివెట్టి కొందరు విపరీతముగా వాదించుచుందురు. ముస్లిములు భారతజాతికంటె భిన్నజాతివారను సిద్ధాంతము లేవదీసి భారతదేశమునుండి విడివడి సర్వతంత్ర స్వతంత్ర రాజ్యమును స్థాపించు ఉద్దేశముతో ప్రచారమునకు విచ్ఛిన్నవాది పాకిస్థానువాదము. ఆంధ్రరాష్ట్ర సమస్య అట్టిదికాదు. చాల పురాతన సమస్య. హైదరాబాదు ప్రభువు నాటినుండి అనగా 1911 నుండి ప్రభుత్వామోదము పొందిన భాషాప్రయుక్త రాష్ట్రసిద్ధాంతము ననుసరించునది. ఆంధ్రులు తాము భారతజాతికంటె భిన్నులమనుటలేదు. భారతరాజ్యాంగమునుండి విడాకులు పుచ్చుకొని ఆంధ్రరాష్ట్రమును సర్వతంత్ర స్వతంత్రరాజ్యముగా నిర్మాణము చేయగోరుటలేదు. భాషాప్రయుక్త రాష్ట్రవిభజనమునిట్లు ప్రభుత్వము, కాంగ్రెసేగాక, హిందూ మహాసభ, ముస్లింలీగు, కమ్యూనిస్టు, సోషలిస్టు, రాడికల్ పక్షములు మున్నగు మతరాజకీయ సంస్థలుకూడ ఆమోదించుచు, ఈ సిద్ధాంతము ననుసరించియే తమతమ సంఘముల నిర్మాణము చేకొనుచుండుట ప్రత్యక్ష ప్రమాణమే గదా! పాకిస్తాను వాదమునకును ఆంధ్రరాష్ట్రవాదమునకును సంబంధ సాదృశ్యము లెక్కడనో యోచింపుడు!

రాష్ట్రనిర్మాణమునకై మనము చేయుచున్న ఆందోళనమున రాయలసీమ సోదరులు మనస్ఫూర్తిగ, ఏకగ్రీవముగ కలిసి రాకుండుట శోచనీయము. బుద్ధిపూర్వకములు కానివి, సమాలోచనతో, సమరసభావములతో సవరించుకొనదగినవి ఏవేవో చిన్నచిన్న లోపములు ప్రజారంగములందనుభవమునకు వచ్చినంతమాత్రమున రాష్ట్రనిర్మాణమునకు వారు విముఖులు కారాదు. ఆంధ్రులైనవారు ఆంధ్రరాష్ట్రములో నుండినప్పటి కంటె, ఆంధ్రరాష్ట్రమును కాదని సాధింపగల మేలు లవలేశమును ఉండబోదు. ఈ వాస్తవిక సత్యమును గ్రహించిన అచటి సోదర ప్రముఖులు పలువురు ఆంధ్రోద్యమమునకు అఖండమగు బలసంపత్తి చేకూర్చుచుందురు. రాయలసీమ సోదరు లెల్లరును వారి మార్గమునే అనుసరింతురు గాకయని ఆశింతును.

ద్వితీయ ప్రపంచసంగ్రామ సమయమున ఆంధ్రరాష్ట్ర నిర్మాణసమస్య యుద్ధానంతర కార్యప్రణాళికయందు విశేష ప్రాముఖ్యము వహించునని ప్రభుత్వమే ఇందుకు ముందుగా నడుముకట్టునని నమ్మినవారు గలరు. అంతువలననే యుద్ధసమయమున రాష్ట్రసమస్యను గూర్చి ప్రభుత్వము ఒత్తిడి చేయరాదను భావము కొందరిలో వ్యాపించియుండెను. యుద్ధము ముగిసినది. మిత్రమండలికి విజయప్రాప్తి కలిగినది. అనేక రాజకీయ సమాలోచనలు రాయబారములు తత్ఫలితముగా తీవ్రములను సెన్సోమార్పులు జరుగ సాగినవి. నేటికి, బ్రిటిషు రాజనీతిజ్ఞుల ఔదార్యమువలనో, అంతర్జాతీయ రాజకీయ ప్రభావములవలనో దేశములో కాంగ్రెసు ప్రభుత్వములు నెలకొన్నవి. కేంద్రమున కాంగ్రెసు పట్టము క్రింద పండిట్ నెహ్రూ ఆధిపత్యమున తాత్కాలిక జాతీయ ప్రభుత్వ మేర్పడి అంతర్జాతీయ ప్రశస్తినందుచున్నది. భారతదేశ భవిష్య రాజ్యాంగమును నిర్మించుటకు రాజ్యాంగనిర్మాణసభ యేర్పడి కొంత కలాపము నడిపినది. రాజకీయ వాతావరణమున నెప్పుడేమి జరుగునో చెప్పరానంత వేగముగా క్షణక్షణ పరిణామములు కలుగుచున్నవి. ఈ సందిగ్ధసమయములలో మిన్నక్షితిపరకును సర్ విజయరాగారు అగ్రస్థులుగానుండి భారతరాజకీయములయందు ఆంధ్రమహాసభ కొక విశిష్టస్థానమును సంపాదించిరి. ప్రజాహృదయములను మహాసభ వంకకును, రాష్ట్రసమస్య వంకకును అమితముగా ఆకర్షించిరి. ప్రభుత్వాధికార వర్గముల భావప్రపంచములలో మిన ఉనికి స్థావరము కలిగించుటకు వారుచేసిన విరామమెఱుగని ప్రయత్నము లెంతయు స్తవనీయములు.

ఏ కాంగ్రెసు మహాసభ భాషాప్రయుక్త రాష్ట్రసిద్ధాంతము చిరకాలము క్రిందటనే ఆమోదించి, తదనుగుణముగ రాష్ట్రసంఘము లనిర్మాణముగావించి ఇంతకాలము నుండియు వ్యవహరించుచున్నదో ఆ కాంగ్రెసేగదా నేడు ప్రభుత్వము చేయుచున్నది! కాంగ్రెసుతో మన ఉద్యమము నకు గల సంబంధముకూడ అత్యంత సన్నిహితమైనదిగదా! మన కోరిక లీడేరుటకు, మన రాష్ట్రము సిద్ధించుటకు ఇంతకంటె అనుకూలసమయ మేముండును? ముప్పదియైదేండ్లనుండియు మనము చేయుచున్న కృషి ఫలోన్ముఖమను తరుణము వచ్చినది. దీనిని మించిపోనీయక మహాసభ సమర్థముగ సర్వశక్తి సంపన్నముగ పని చేసి, ఆంధ్రరాష్ట్రమును ఇప్పట్లనే సాధించి తీరవలయును. కాంగ్రెసు అధినేతలును ప్రసన్నులై ఆంధ్రుల చిరకాల వాంఛితమును నెరవేర్చుట ధర్మము.

1941 వ సంవత్సరమున విశాఖపట్టణములో సర్ విజయరాగారి నాయకత్వమున జరిగిన ఆంధ్ర మహాసభా సమావేశములో అప్పటికి రాష్ట్రీయశాసన సభలలో ఆమోదింపబడిన ఆంధ్రరాష్ట్ర నిర్మాణము తీర్మానమునుగూర్చి తెరవెనుక జరిగిన కొన్ని యుదంతములు పూజ్యులైన శ్రీ ప్రకాశం పంతులుగారు ప్రకటించిరి. ఆనాడు పంతులుగారు వెల్లడించిన కథనములు వినుచుండిన సభ్యుల కెల్లరకును, అమితమగు వేదనతోపాటు ఈసారి పంతులుగారు ప్రధానియైన పక్షమున ఆంధ్రరాష్ట్రము సిద్ధించి తీరునను ఆశయు జనించినది. కాని, మన నాయకులైన ప్రకాశం పంతులుగారు రాష్ట్రప్రధానిగాయుండగా మనకు రాష్ట్రము సిద్ధించకపోవుటయు, రాష్ట్రము సిద్ధించకపూర్వమే ఇంతలో పంతులుగారు ప్రధానామాత్య పదవిని త్యజించవలసిన పరిస్థితు లేర్పడుటయు నిజముగా మన దురదృష్టము. వినప్పటికిని, ఇదియూ నొక విధముగ ఆంధ్రులకు, ఆంధ్రోద్యమమునకు మేలనుకొనవచ్చును. ఏమనిన, ప్రధానామాత్యపదవిలోనుండి నప్పటి శృంఖలములు పంతులుగారినిప్పుడు బాధించవు. కావున, విశాలతరమగు ప్రజారంగమునందుండి, తమ యనుభవములన్నిటిని సమన్వయము చేయుచు రాష్ట్రసంపాదనోద్యమమునకు నాయకత్వము వహించి ఆంధ్రుల చిరవాంఛితమును సఫలమొనర్చి ఆశేషాంధ్ర ప్రజానీకపు మన్ననలందగలరని ఆశింతును. మీరటు కాంగ్రెసు మహాసభా సందర్భమునను, కార్యవర్గ సమావేశములోను, రాజ్యాంగ సభా సమావేశములయందును మన నాయకులెంతశ్రమపడినను, ఆంధ్రరాష్ట్ర నిర్మాణ విషయము పొందుచున్న ఆదరము మిక్కిలి శోచనీయమగుచున్నది. ప్రసంగవశమున నిటీవల ఆంధ్రరాష్ట్ర నిర్మాణమున కింకను కొంత కాలవిలంబము తప్పదను భావముకూడ కాంగ్రెసు అధిష్ఠాన వర్గము బహిర్గతము గావించెను. అది తడవుగా డాక్టరు పట్టాభి సీతారామయ్య పంతులుగారు అట్టికాలవిలంబమున కావశ్యకము లేదనియు రాష్ట్రనిర్మాణ మవశ్యకర్తవ్యమనియు అపూర్వములను ధైర్యోత్సాహములతో నుద్ఘాటించి, తదాది విరామము లేకుండ ప్రచార ప్రబోధములగావించుచున్నారు. ఆచార్య రంగాగారును, ఢిల్లీలోనున్న రాజ్యాంగసభా ఆంధ్రసభ్యుల నందరను సమీకరించి తాత్కాలిక ప్రభుత్వోపాధ్యక్షులగు నెహ్రూజీ వద్దకు రాయబారము గొంపోయిరి. ఈ సందర్భమున కేంద్రములో పీఠము పెట్టుకొని, అటు కాంగ్రెసు అధిష్ఠానవర్గమునందును, ఇటు రాజ్యాంగ సభయందును డాక్టరు పట్టాభి, ఆచార్యరంగా, కళావేంకట్రావు, దుర్గాబాయి, అనంతశయనం ప్రభృతులు చేయుచున్న కృషి ప్రశంసార్హముగ నున్నది.

రాజ్యాంగ సభానియుక్తులైన సర్ బి. యన్. రావు కమిటీవారు భాషాప్రయుక్తరాష్ట్ర నిర్మాణ సమస్యను గూర్చి యొక ప్రణాళికను సిద్ధపరచిరి. చెన్నపురిమును తత్పరిసరములను ప్రత్యేక మండలముగ విడదీసి నగరమున కుత్తరభాగము నొక రాష్ట్రముగను దక్షిణభాగము నొక రాష్ట్రముగను విభజన చేయవలయునని ఈ ప్రణాళిక సూచించుచున్నది. దీనికి ప్రత్యేక శాసనసభలు, మంత్రివర్గములు నుండును. గవర్నరు మద్రాసులోనే యుండును. రెండు శాసనసభల నుండియు, మద్రాసు మండలము నుండియు వచ్చిన ప్రతినిధులతో నేర్పడి సమష్టి శాసనసభయు, సమష్టి మంత్రివర్గమును ప్రభుత్వ నిర్వహణమున గవర్నరుకు తోడ్పడుచుండును. సమష్టి వ్యవహారములలో తప్ప, ఏరాష్ట్ర విషయములు ఆరాష్ట్ర మంత్రివర్గ సభ్యుల సలహాల ననుసరించి గవర్నరు పాలించుచుండును. ఏరాష్ట్రవాసు రాష్ట్రీయభావములో వ్యవహరించు శాసనచ్ఛాయట కూడ! ఇటీవల బెజవాడ పురపాలక సంఘమువారి సన్మానమునకు సమాధానము నొసగుచు మదరాసు గవర్నరుగారిట్టిపథకమొకటి చర్చలో నున్నట్లు వెల్లడించిరి. బహుశః వారి ప్రకటనకీ ప్రణాళికాంశములే ఆధారములై యుండును. ఆంధ్రరాష్ట్రమా? తమిళరాష్ట్రమా? నామకరణము చేయలేదు తప్ప, ప్రస్తుతమున్న మద్రాసు రాష్ట్రమును కొక్కుచెదర నీయకుండ, భాషాప్రయుక్త రాష్ట్రవాదులకును మనలను కొంతవరకైనను తృప్తిపఱుప వలయునను ప్రయత్నమను లేకపోలేదు. వీని ఫలితాంశ మేమన, మనకు కొన్ని క్రొత్తపదవులు, క్రొత్త అధికారములు, క్రొత్త అవకాశములు లభింపగలవేగాని, మనకుకోరు ఆంధ్రరాష్ట్ర స్వయాధీనము పూర్ణముగ సాక్షాత్కరించుట లేదు. భారతదేశమున భాషాప్రయుక్త రాష్ట్రములుగా విభజింప బడవలసినవి, బొంబాయి, మద్రాసు రాష్ట్రములలోను, సైజాము, మైసూరు, తిరువాన్కూరు, కొచ్చిన్ సంస్థానముల యందును, వ్యాప్తములైయున్న ఆంధ్ర, తమిళ, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర ప్రాంతములు, సంస్థానముల వ్యవహారము పరిష్కరించుకొనుట ఇంతలో సాధ్యము కాదు. గనుక, బొంబాయి, మద్రాసు, రాష్ట్రములనైనను, భాషాప్రయుక్తములుగా పునర్విభజన చేయవచ్చును. అమాత్య ప్రణాళికయందు 'ఏ' గ్రూపులోనున్న వీనికి ఒక రాజ్యాంగవిధానము ను నిర్ణయించి భాషాప్రయుక్త రాష్ట్రనిర్మాణమునకు పన్నాహములు చేయవచ్చును. ఇప్పటికైనను మించిపోయినది లేదు. రాజ్యాంగసభయు, అద్దాని సూత్రధారణము వహించు కాంగ్రెసు అధిష్ఠాన వర్గమును మేలు దలంచెనేని రాష్ట్రనిర్మాణము కనుకూల్యముకాదు.

శ్రీ శంకరరావుదేవు ప్రోద్బలమున నేర్పడిన భాషాప్రయుక్తరాష్ట్రసమితి సమాచారములను ఈ సందర్భమున ముఖ్యముగా గమనార్హములు, కాంగ్రెసును, రాజ్యాంగనిర్మాణసభను సత్వర భాషాప్రయుక్త రాష్ట్రనిర్మాణ కార్యమునకు అభిముఖము గావించి, ఏతన్నిర్మాణమును వేగిరింప జేయుటే దీని ఆశయము, ఢిల్లీలో ఇటీవల సమితి సమావేశమున జరిగిన తీర్మానములు ఎసెంబ్లీ నాయకులకు పంపబడినవి. శ్రీ శంకరరావు దేవు కాంగ్రెసు ప్రధాన కార్యదర్శియగుట దీని ఆశయసంసిద్ధికి మిక్కిలి అనుకూల్య మేర్పడినది. ఈదేవు సమితి నిర్మాణారంభము నుండియు డాక్టరు పట్టాభిసారథ్యమును దీని కలఖిపించుట డాక్టరుగారి సామర్థ్యమును, ఆంధ్రుల భాషాప్రయుక్త రాష్ట్రవాద ప్రాచీనతను గుర్తించియేయై యుండవలెను. వీరి ఉభయుల సారథ్యమున నీసమితి కాంగ్రెసు నాయకత్రయమగు పటేల్, నెహ్రూ, కృపాలినీల ఆమోదమును సంపాదించి గమ్యము చేరగలదనుట నిశ్చయము. ఈ సందర్భమున ఆంధ్రమహాసభా మిత్రులు కొంద రీసమితికి ఆంధ్రశాఖనుకూడ ప్రారంభించి అమితోత్సాహముతో నిర్వహించుచున్నారని తెలుపుటకు సంతోషమగుచున్నది.

రాజ్యాంగసభా సందర్భములందు కేంద్రస్థానమగు ఢిల్లీలో ఆంధ్రమహాసభా కార్యస్థానమును (సెలకొల్పి నిర్వహింప కార్యవర్గము సంకల్పించినది. రాజ్యాంగ సభయందలి ఆంధ్రసభ్యుల సహకార సంపత్తి నిసంపాదించియు, ఏతత్సభా సభ్యులందరకును, అస్థకులకును ఆంధ్రరాష్ట్ర నిర్మాణ ప్రోద్బలకములగు సమస్త సమాచార సామగ్రియును సమకూర్చి సమర్పించుచుండుటకును, ఈ కార్యస్థానమున కొందరు కార్యసచివులుందురు. ఇంతేకాక ఆంధ్రమహాసభాపక్షమున తాత్కాలిక ప్రభుత్వ మంత్రుల యొద్దను రాజ్యాంగ సభా కార్యకర్తకడకును రాయబారములు పంపుటకు, ప్రత్యేక నివేదికలు సమర్పించుటకు ప్రయత్నములు జరుగుచున్నవి. అమిత వ్యయభరితమగు ఈ కార్యాకలాపమంతయు నెఱపుటకు మహాసభచేసిన విజ్ఞప్తి నాదరించి కొందరు వదాన్యులప్పుడే విరాళ వాగ్దానములు చేసిరి, జయపురము ఆంధ్రజమీందారులు, భూస్వాములు, ధనికులు, ఎల్లరును, ఆంధ్ర మహాసభ కిపుడు విరాళము లిచ్చి తోడ్పడవలసి యుండునని విన్నవింతును. ఈ కార్యస్థానము పనిచేయుచుండినంత కాలమును ఆంధ్రులకు రాజ్యాంగసభాసభ్యులును, నాయకులును, ఆంధ్రరాష్ట్ర సమస్యను సర్వదా బలీయమొనర్చు కార్యస్థాన నిర్వహణకు సర్వవిధ సహకారము చేయుట ధర్మమనియు విన్నవింతును.

సిద్ధాంతములను బట్టిగాని, పోకడలనుబట్టిగాని, మనలో మన కనేక భేదము లుండవచ్చును. రాజకీయభావ భేదములుండవచ్చును. కాంగ్రెసు, హిందూ మహాసభ, ముస్లింలీగు, సోషలిస్టు, రాడికల్, అతివాద, మితవాద ప్రభృతి భిన్నభిన్న దృక్పథముల వారికెవరికైనను ఆంధ్రరాష్ట్ర సంపాదనానవసరమున రెండభిప్రాయము లుండరాదు. ఆంధ్రులైనవా రందరును త్రికరణశుద్ధిగ ఏకీభావముతో, ఏకాగ్రతతో అఖండమగు ఆందోళనము ప్రచారము చేయవలసిన సమయమిది. రాజ్యాంగ సమావేశ దినములందు విశాలాంధ్రము నందన్ని మూలల నుండియు ప్రజానీకము వేల కొలదిగ మహాజరులు, టెలిగ్రాములు, పంపి రాష్ట్ర సంపాదనాసక్తమగు మన గాఢవాంఛను ఒక్కుమ్మడిగా వ్యక్తమూ చేయవలసి యుండును. ఇదియంతియు కేవలము లాంఛనప్రాయముగాదు. రాష్ట్రసంపాదనకు మనము చేయు తీవ్రప్రయత్నము.

ఆంధ్ర వంశకర్తల ఆశీర్వచన బలమువలన ఆంధ్రమహాసభల రజతోత్సవ సమావేశములు ఆంధ్రరాష్ట్ర సంపాదన విజయోత్సవ సమావేశములుగా జరుపుభాగ్యం మనకచిర కాలమునకే ప్రాప్తించు గాక యని ఆశించుచు మహాసభా కార్యక్రమ నిర్వహణ కుపక్రమింతును

కార్యవర్గ తీర్మానం

(1వ పేజీ తరువాయి)

దుకు ఆహ్వానసంఘంవారికి నా హృదయపూర్వక వందనములు. ఈ పతాకం ఆంధ్రుల విశిష్టత విజ్ఞానానికి, ఐక్యత్వానికి చిహ్నం. గడచిన సంవత్సరం గుంటూరులో యీ పతాకం శ్రీ కొండా వెంకటప్పయ్య పంతులుగారిచే ప్రతిష్ఠించబడ్డది. ఈ సంవత్సరం స్త్రీ అయిన నన్ను ఈ కార్యక్రమమును చేయటానికి ఆహ్వానించడంలో బోధ్యత్వం విశిష్టతఉందనిఅనుకొంటున్నాను

ఆంధ్రజాతి 450 యేండ్ల కాలమునుండి అఖండంగా గొప్పరాజ్యాన్ని స్థాపించి, అత్యంత దూరదేశాలకు పయోధి వాణిజ్యాన్ని వ్యాపింపజేసిన విషయమును ఆంధ్రజాతి విజ్ఞానము సంస్కృతి అతులిత వైశ్వర్యాలను ప

ఆ. హిం. ఫౌజ్ ఖైదీల విడుదలచేస్తే తనపదవికి రాజీనామా ఇస్తానని

సర్ ఆకిన్లెక్ హెచ్చరిక

ప్రభుత్వ వైఖరిని వివరిస్తూ అసెంబ్లీలో పండిట్ నెహ్రూ ప్రకటన

ఫెడరల్ కోర్టు సలహా పొందుటకు నిర్ణయం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 3. కారాగారవాస శిక్షను అనుభవిస్తున్న ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికుల నందర్ని విడుదల చేయాలని గవర్నర్ జనరలుకు సిఫార్సు చేస్తూ ఖాన్ అబ్దుల్ ఖనీఖాన్ గారు అసెంబ్లీలో ఒక తీర్మానాన్ని ప్రతిపాదించారు.

ఆ తీర్మానం సందర్భములో ప్రభుత్వ వైఖరిని వివరిస్తూ విచారణలను పునఃపరిశీలించ వలసిందని ఫెడరల్ కోర్టు అభిప్రాయమును తెలుసుకోదలచినట్లు పండిట్ నెహ్రూ ప్రకటించారు. సభవారానిర్ణయాన్ని ఆమోదించకపోతే రాజీనామా ఇస్తామనికూడా ప్రకటించారు.

ఫెడరల్ కోర్టు సలహాను కోరక శిక్షితుల విడుదలచేస్తే తన పదవికి రాజీనామా ఇస్తానని సర్వసేనాని సర్ క్లాడ్ ఆకిన్‌లెక్ ప్రభుత్వానికి చెప్పారు. రాజీగా కేసులను ఫెడరల్ కోర్టుకు నివేదించుటకు నిర్ణయమైంది.

అనధికార తీర్మానముల చర్చించుటకు కేంద్ర అసెంబ్లీ ఈ రోజు సమావేశమైనది. ప్రస్తుతము శిక్షలను అనుభవిస్తున్న ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికుల నందర్ని విడుదల చేయవలసిందిగా గవర్నరు జనరలుకు సిఫార్సుచేస్తూ పరిహార్దు ప్రతినిధి ఖాన్ అబ్దుల్ గనీఖాన్ లోగడ ప్రతిపాదించి ఉండిన తీర్మానముపై నేడు తిరిగి చర్చ ప్రారంభమైనది.

సంయుక్తరాష్ట్ర సభ్యుడు పండిట్ బాలకృష్ణశర్మగారు చర్చను ప్రారంభిస్తూ భారతదేశం ప్రస్తుతం అత్యంత క్లిష్టపరిస్థితుల నెదుర్కొంటూ చాలా కఠినమార్గాన ప్రయాణంచేస్తూ ఉందనీ, భారతప్రజా ప్రతినిధులు కొన్ని మరతులకు, పరిమితులకు లోబడి పనిచేయవలసి వచ్చిందన్నారు. సైన్యంనుండి బర్తరఫ్ చేయబడిన ఆజాద్‌హింద్‌ఫౌజ్ సైనికులకు ప్రభుత్వం వారు ఉద్యోగాలు చూపలేక పోవడం చాలా శోచనీయం అని పండిట్ శర్మగారన్నారు.

సభానాయకుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆజాద్ హింద్‌ఫౌజ్ ఖైదీల, శిక్షితుల విషయమై ప్రభుత్వవైఖరిని వివరిస్తూ దీర్ఘంగా ప్రసంగించిరి. భారత జాతీయ సైనికుల విచారణ చరిత్రను సంగ్రహంగా నివేదిస్తూఆవిచారణకాలంలోనూ, తదనంతరమూకూడా ఈ సైనికులకు తాము చేయకలిగిన సహాయం అంతా చేసినామని ప్రకటించిరి. కేవలము ఇది సైనిక, సాంకేతిక వ్యవహారమే కాదనీ ఈసమస్యకు ఒక ప్రత్యేకప్రాధాన్యం, ప్రాముఖ్యత ఉన్నదని గుర్తించే తాము అలా చేసినామనీ పండిట్ నెహ్రూ తెలియజేసినారు.

పండిట్ నెహ్రూ తమ ఉపన్యాసంలో ఇంకా ఈ విధంగా ప్రకటించినారు.

"సైన్యంలో చాలా కఠినమైన క్రమశిక్షణ ఉండాలని సభా సభ్యులు యావన్మందీ అంగీకరిస్తారనే అనుకుంటాను. కాని భారతదేశంలో ఇటీవలివరకూ రకరకాల శక్తులు పనిచేస్తూ ఉన్నవి. సైనికుల భక్తి, శ్రద్ధలు అనేకములైనవాటిపై విస్తరించిఉంటూ ఉండేవి. సైనికశిక్షణకు బద్ధులై ఉండాలనేభావం వారిని ఒకవైపుకు లాగుతూ ఉండేది. మరోభావం, అది చాలా భిన్నమైన అత్యంతావశ్యకమైనదీ- వారిని దేశక్షేమంకొరకు పాటుపడాలని ప్రోత్సహిస్తూ ఉండేది. ఈ రెండు భావాలకూ సంఘర్షణ వచ్చినప్పుడు వ్యక్తుల హృదయాంతరాళంలో దారుణమైన సంఘర్షణ ఏర్పడుతుంది ఆ సంఘర్షణను కేవలం సాంకేతిక ప్రమాణములబట్టి విచారించి, ఆవ్యక్తి లేక ఆవ్యక్తులు తప్పుచేసినారని తీర్పు చెప్పడం కేవలం అవివేకం. ఇలాంటి అంతరసంఘర్షణ సైన్యంలో ఉన్నవారిలోనే గాక, తదితరులలోనూ భూతకాలంలో కలిగింది. కాని ఇలాంటి సంఘర్షణలలో బాధపడేది సత్యంగా ప్రవర్తించేవ్యక్తులే.

"ఒకరకమైన ప్రత్యేకపరిస్థితులలో ఆజాద్‌హింద్ ఫౌజ్ సైనికులు ఒక నిర్ణయానికి వచ్చారు. ఆ పరిస్థితుల్లో మనమే ఉంటం తెలస్తేస్తే మనం ఎలాచేసి ఉండేవాళ్లమో తెలియదు. కేవలం దేశభక్తి ప్రపూరితులై, తమ మాతృభూమికి సేవ చేయాలనే ఉత్సాహంతో, తమ విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తిస్తున్నామనే భావంతో వారు అలాచేసి ఉంటారని నాకు తోస్తున్నది. అయితే ఈ జాతీయ సైన్యంలో ఉన్న ప్రతిఒక్కడ్నే మనం దేశభక్తుడ్నిగానూ, వీరునిగానూ భావిస్తున్నామని ఎవ్వరూ అపోహపడరాదు. ఏ సంఘంలోనూ, అది ఎంత ఉత్తమమైన సంఘం అయినాగాని, అందరూ ప్రతిఒక్కరూ వీరుడు, దేశభక్తుడు కాదు. మంచివారూ ఉంటారు చెడ్డవారూ ఉంటారు. అటు అంత మంచివారూ గాక, ఇటు అంత చెడ్డవారూగాక మధ్యరకంగా ఉండేవారూ ఉంటారు. కాని ఇలాంటి పరిస్థితుల్లో మనం ఒకరి ప్రవర్తనపై గాని, ఒకసంఘటనపైగాని తీర్పు చెప్పేటప్పుడు, అనేక విషయాలను ఆలోచించాలి. ఆ విషయమై సందేహంలేదు. ఈసంగతి సందర్భాలన్నీ విచారించే ఈఆజాద్ హింద్ ఫౌజ్ విషయంలో మేమొక విధానాన్ని అనుసరించి ఉన్నాము. తత్రాపి జరిగిన సంఘటనలు ఏవీకూడా అప్పటి మా విధానం పరిమైంది కాదనిబుజువు చేయలేదు. అంతేకాదు. ఆవిధానాన్ని అనుసరించడంలో మేము సరిగ్గా, సవ్యంగానే ప్రవర్తించామని, ఇప్పటికే నమ్ముతున్నాను."

బర్తరఫ్ అయిన సైనికులకు ఉద్యోగాలివ్వకపోవడం గురించి పండిట్ శర్మగారి విమర్శకు సమాధానంగా పండిట్ నెహ్రూ ఇలా చెప్పారు: "వీరికి యేదో ఒకఉద్యోగం ఇప్పించడానికీ, వీరికి జీవనభృతి కలిగించడానికీ మేము ప్రయత్నించాము. ఇంక ప్రభుత్వానికి సంబంధించినంతవరకు సైనిక పోలీసు శాఖల్లలో తప్పుమిగతా పౌరపరిపాలనా శాఖలన్నింటిలోనూ వారికి ఉద్యోగాలు ఇవ్వడానికి వీలుంది. అయితే ఆయా ఉద్యోగాలు చేయడానికి వారు అర్హులై ఉండాలి. కేవలం ఆజాద్‌హిందీఫౌజ్‌కు చెందిన వారనే కారణంగా వారికి ఉద్యోగాలు ఇవ్వజాలరు.

"అపరిస్థితులలో ఉండిపోయినవారిపై రాజుగారిపై యుద్ధం సాగించారనే నేరాన్ని ఆరోపించడం, కేవలం ఒక టెక్నికల్ పాయింటుమీద చాలా తప్పని, దేశబుబు అని ఎంచి మేమా విధానాన్ని అనుసరించాం. అట్టి ఆరోపణ చేయడం తప్పని, అనేక ఇతర కారణాలతోబాటు బూలాభాయ్‌దేశాయ్‌గారి అత్యద్భుతవాదన వల్ల, మేము ఋజువుచేయకలిగాం అని భావిస్తున్నాం.

"ఈవిషయంలో భారత సర్వసేనాని చాలా వివేకవంతంగానూ, దూరదృష్టితో ప్రవర్తించారనీ చెప్తున్నాను. సబలైన ఏప్రమాణాన్నిబట్టి, ఏదృక్పథంనుంచి విచారించినా ఆవిధానం దృక్పథం చాలా న్యాయమైనదనే నేను అనుకొంటున్నాను. ఆయన ఆజైఖరిని అనుసరించినప్పుడు సర్వసేనానిని అభినందించడానికి సాహసించాను. 'అభినందన' అనే మాటను ఇప్పుడు పునశ్చరణ చేస్తున్నాను. అనేక విషయాలపై ఏకాభిప్రాయానికి రావడానికి మనం ఎంత ప్రయత్నించినా సభికులు ఒక ముఖ్య విషయాన్ని గుర్తించాలని మనవి చేస్తున్నాను. చాలా సమస్యల విషయంలో భారత దృక్పథానికీ, బ్రిటిష్ దృక్పథానికీ ప్రధానమైన తేడా ఉంటుంది.

"ముందు ముందు భారతదేశం సర్వస్వతంత్రదేశం అయినప్పుడు ఈ విభేదం, ఈ తేడా పూర్తిగా అంతరింపవచ్చును. కనుకనే ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికుల విషయంలో ఒక సంవత్సరం క్రితం ఒక విధమైన వైఖరిని అవలంబించడానికి నాకు గాని, ఈ సభాసభ్యులైన ఇతరులకుగాని తేలికగా ఉండెను. కాని సైనిక దృష్టి, బ్రిటిష్ దృక్పథం గల సర్వసేనానికి ఈ విషయంలో ఒక సామాన్య విధానాన్ని అనుసరించడం సాధ్యంగాదు.

"కాని మామూలు భారతీయుల మనస్సుల్లోనూ, సైన్యంలో ఉన్న భారతీయుల మనస్సుల్లోనూ ఉన్నట్టి భావాలను గుర్తించినవాడై నందువనే సర్వసేనాని ఆయన అనుసరించినట్టి విధానాన్ని అనుసరింపకలిగినాడు. కాని అప్పట్లోనూ, ఆ తరువాతనూ కూడా మనం ఈవిషయాన్ని సైనిక క్రమశిక్షణపై అన్యాక్రమణ జరిపిన రాజకీయ వ్యవహారంగా పరిగణిస్తున్నాము. క్రమశిక్షణకు భంగం కలిగినాకూడా, కేవలం రాజకీయ హేతువులపై శిక్షను విధించుటను మనం ప్రతిఘటించాం. వాస్తవానికిది రాజకీయాలకు సంబంధించిన విషయమే. ఈ విషయాన్ని అప్పటి సర్వసేనాని, భారత ప్రభుత్వంకూడా అంగీకరించినవి. ఆజాద్ హింద్ ఫౌజ్ వారిని భారతసైన్యంనుండి తొలగించివేసినారు. వారికి రాతను అలవెన్సులను రద్దుచేసినారు. ఆవిధంగా శిక్షలు విధింపబడినమాట వాస్తవమే. సాధారణ పరిస్థితుల్లో సైన్యంనుండి పంపివేయబడినవారికి వచ్చే అలవెన్సులు, జీతాలబకాయీలు అన్నీ వీరికివ్వబడలేదు. కాని అలాంటి శిక్షకుమించి, కారాగారవాసం లాంటి ఇతర శిక్షలుమాత్రం విధింపబడియుండలేదు.

కాని రాజుగారిపై యుద్ధాన్ని సాగించి సైనిక నిబంధనలకు భిన్నంగా ప్రవర్తించడంగాక అమానుషచర్యలు జరిపిన నేరం మరొకటి ఉంది. ఈ రెండు నేరాలకూ వ్యత్యాసం ఉందన్నారు. ఈ రెండవ నేరం రాజకీయాలకూ, కేవలం భారతజాతీయ సైనిక వ్యవహారాలకూ సంబంధించనిది. సైనిక సంప్రదాయములకు విరుద్ధంగాను, అతి అమానుషింగానూ, నీచంగానూ ప్రవర్తించిన ఉద్యోగులను సైనికులనూ మామూలుసైన్యంలోనే శిక్షించడం కర్దు 'మాసైన్యానికి చెందినవారినే వారు చేసిన కొన్ని పనులకు ఒక పద్ధతిన శిక్షిస్తూఉండగా, అలాంటి పనులను చేసినందుకు భారత జాతీయ సేనకు చెందిన వారనే కారణంమీద అట్టి నేరస్థులను అదేవిధంగా శిక్షించడానికి మాకు అధికారంలేదా ?' అని సైనికాధికారులు ప్రశ్నించారు.

"ఆప్రశ్నకు సమాధానం చెప్పడం అంత తేలికైన పనికాదు. ఇలాంటి విషయాల్లో ప్రభుత్వం చాలాకరకు సైన్యాధిపతి సలహాపై ఆధారపడవలసి ఉంటుంది. భారత ప్రభుత్వం ఇలాంటి విషయాల్లోనూ, ఇంకా అనేక ఇతర విషయాల్లోనూ ముఖ్యంగా రాజకీయ వ్యవహారాల్లో విధిగా సర్వసేనాని సలహాను పొందవలసి ఉంటుంది.

"కాని భారత ప్రభుత్వ దృక్పథానికీ, సర్వసేనాని దృక్పథానికీ తీవ్రమైనభేదం ఏమైనా ఉంటే అప్పుడు సర్వసేనానిని మార్పుచేయవలసి రావచ్చు. ఇలాంటి విషయాల్లో అందుకు సంబంధించినవ్యక్తి ప్రభుత్వానికి సలహాఇచ్చి, అందుకు బాధ్యత వహించవలసి ఉంటుంది. కనుక ఈ ఆజాద్ హింద్ ఫౌజు సైనికులప్రశ్న వచ్చినప్పుడు మేము భారత సర్వసేనాని సలహా అడిగాము. ఇది చర్చకుతగిన విషయంకాదని నేను అభిప్రాయ పడినాను. వాతోఉన్న ఇతర ప్రభుత్వ సభ్యులందరి అభిప్రాయమూ ఇలాంటిదే అనికూడా చెప్పసాహసిస్తున్నాను. మేము చాలా కాలంగా ఈ భారత జాతీయసైనికుల విచారణలో ముడిగి ఉన్నందునను, ప్రజల కీవిచారణ శిక్షలు సమ్మతంగా లేనందునను, ఈ కర్మకాండనంతా ఎంతత్వరగా ముగించివేస్తే అంత మంచిదని మేము అభిప్రాయపడితిమి.

"మేము భావించినంతటి స్వల్ప, సామాన్యవిషయంగా, సర్వసేనాని భావించి ఉండలేదు. ఇందుకు సంబంధించినవి ఇతరసమస్యలు అనేకముఖ్యలున్నవి. ఇట్టి చర్య అనేక ఇతర ఫలితములకు దారితీయును. వీరివిషయంలో ఇలాంటిచర్య తీసుకోవడం మంచిదనే అభిప్రాయం తనకు కలగలేదన్నారు. ఇది ప్రధానంగా సర్వసేనానికిసంబంధించిన విషయం అయినందున వారి పూర్తిసమ్మతి, ఆమోదం లేనిది ఎలాంటిచర్యా తీసుకోదలచలేదు. ఆ కారణంగా మేము కొంత ఇరుకులో పడ్డాము. అంచేతనే ఈ విషయమై ఒక నిర్ణయానికి రావడానికింత ఆలస్యం అయింది.

"గత కొద్దిమాసాల్లోనూ ఇంతగానన్ను కలవరపెట్టిన సమస్య ఇంతగా సేనాలోచించిన సమస్య మరొకటిలేదు. ఏ సందర్భంలోనూ ఏ సమయంలోనూ ఈ సంగతిని మేము విస్మరింపలేదు. ఈ సమస్యను దీర్ఘంగా విచారించాం. మాలో మేము చర్చించుకున్నాం. పూర్వోత్తర వాదాలను పరిశీలించాం. సమగ్రంగా, విచారించాం. కాని ఈ ఇబ్బందివల్లనే మేం ఒక నిర్ణయానికి రాలేకపోయినాము. అలాంటి ఇబ్బందే లేకుంటే ఆజాద్ హింద్‌ఫౌజ్ సైనికుల విషయమై ఒక నిర్ణయానికి రావడానికి మేము ఈ సభ తీర్మానం కొరకు వేచి ఉండేవాళ్లమే కాదు.

"ఈ తీర్మానం వర్తింప చేయవలసిన వ్యక్తులు ప్రస్తుతం 7 గురు మాత్రమే ఉన్నారు. ఇందు ఇద్దరికి 14 సంవత్సరాల కారాగారవాసం విధింపబడింది. ముగ్గురికి ఏడేళ్లశిక్ష విధింపబడింది. ఒకరికి మూడేళ్ళు, మరొకరికి రెండేళ్లశిక్ష విధింపబడింది, వీరు ఏడుగురూ రెండు నేరాలక్రింద-అనగా రాజుగారిపై యుద్ధం చేసినారనీ అమానుషకార్యములు చేసినారనీ-వీరు శిక్షింపబడిరి. అయితే వీరికి విధించిన శిక్షలు కేవలం రెండవనేరం క్రిందనే అనీ, మొదటినేరానికి శిక్ష వారిని సైన్యంనుండి తొలగించడమేఅనీ తెలిసింది. కనుక వీరికి విధించిన శిక్షలన్నీకూడా నాగరికత గలవారెవ్వరూ చేయనట్టి అమానుషచర్యలకీ, అలాంటిచర్యలను మామూలుసైన్యంలో ఉన్నవారు చేసిఉన్నా, అట్టివారికి అలాంటిశిక్షలే విధింపబడిఉండేవి.

"యుద్ధమే చాలా అమానుషం అనీ, ఇంకా అమానుషం అవుతూ ఉందనీ తీర్మానాలన్నీ ప్రతిపాదించినవారన్నారు. నేనూ ఆ అభిప్రాయంతో ఏకీభవిస్తున్నాను. కాని యుద్ధమే అమానుషకార్యం గనుక ప్రతి అమానుషచర్యా తుంతవ్యం అని అనడానికి నేను అంగీకరించను. అలా అంగీకరిస్తే మానవజీవితమే పశుప్రాయం అవుతుంది,

"ఈ కేసులను విచారించిన కోర్టు మార్షలును విమర్శింపగలస్థితిలో నేనులేను. అలా చేయడానికి నాకు ఒకేఒక కారణం కన్పిస్తున్నది. ప్రజల్లో ఉభయపక్షాలకూ చెందినవారు ఉద్రిక్తులై ఉన్న సమయంలో ఈ విచారణలు జరిగినవి. ఈ సమస్యను, నిష్పాక్షికంగా, అభిమాన దురభిమానాలకు తావివ్వక విచారించడాని కది ఉచితమైన సమయం కాదేమో. అది వాస్తవమే అయివుండవచ్చును. కాని ఒక విషయం ఉంది. సక్రమంగా ఏర్పాటైన న్యాయస్థానాలు ఈ విషయాలను విచారించి కొన్ని నిర్ణయాలు వచ్చి ఉన్నవి. న్యాయస్థానములు తప్పనిగాని, సాక్ష్యం గురించిన వారితీర్పు తప్పనిగాని, వారి నిర్ణయాలు నిరాధారములనిగాని అనడం అంత సుకరమైన విషయంగాదు. బాధ్యత గలవారి కెవ్వరికీ అలా చెప్పడం సాధ్యంగాదు.

"మొట్టమొదట మే మీ విషయాన్ని విచారించినప్పుడు ఇబ్బందులు ఆటే ఉండవని మేము అనుకున్నాం. కాని సర్వసేనాని ఈ సమస్యను మేము విచారించిన రీతినే విచారించనందున యిబ్బందులు ఏర్పడినవి. ఈసభలో చేసిన తీర్మానాన్ని అమలుజరుపుటకు వారు సమ్మతించలేదు. అమలుజరపడంవల్ల అనేక చిక్కులు రాగలవని వివరించి చెప్పారు. అన్ని సంగతులను, విచారించినమీదటనే వారీవిధంగా తమ అభిప్రాయాన్ని తెలియజేశారు.

"ప్రస్తుతం ప్రభుత్వంలోఉన్న మేము ఈ సభవారు ఇష్టపడినంతకాలమే ప్రభుత్వంలో ఉండగలం. ఈసభవారు హర్షించినా, నిరసించినా, నిందించినా తమ ధోరణిని మార్చుకొనక తమదారిని తాము పోయే పూర్వపు ప్రభుత్వంలాంటిదిమాత్రం కాదీప్రభుత్వం."

పండిట్ నెహ్రూ ఈమాట అనేసరికి ముస్లింలీగు సభ్యుడు కిద్వాయ్ అలీఖాన్ గారు "అయితే ఆజాద్ హింద్ ఫౌజ్ సైనికుల నందర్ని విడుదలచేయాలనే మాకోర్కెను అంగీకరించండి. ఈ సభలోని అందరి కోర్కె అదే" అని అన్నారు.

పండిట్ నెహ్రూ ఇందుకు ఇలా సమాధానం ఇచ్చారు. "ప్రభుత్వాభిప్రాయములను సభవారికి నివేదిస్తున్నాను. సభవారు ఆ అభిప్రాయంతో అంగీకరిస్తారా లేదా మేము ఏమి చేయవలసిందీసభవారు చెప్తారు. ప్రభుత్వం తనకు మంచిదని తోచినరీతిగా వ్యవహరిస్తుంది. అది అసెంబ్లీకి సమ్మతంకాదూ అప్పుడు ప్రభుత్వం తప్పుకొని మరొకప్రభుత్వానికి దారి ఇస్తుంది. ఇతరుల మనోభావాలను, ఇష్టాలనుబట్టి ఏ ప్రభుత్వమూ గుడ్డిగా పనిచేయదు.

"నేనూ, సైనిక శిక్షణకు సంబంధించిన విషయాలపై తీర్పు చెప్పడం, ఒక అభిప్రాయానికి రావడం మనలో కొందరికి అంత తేలిక అయినపనిగాదు. ఈతీర్మానము విషయంలో ప్రభుత్వాభిప్రాయం ఏమిటీ అంటే ఈకేసుల విషయమై పూర్తిగా విచారించి తమ యభిప్రాయమును అందుకు సంబంధించిన అధికారులకు తెలుపవలసిందిగా ఫెడరల్‌కోర్టును కోరడమే. అదే ఉచితమైన వాంఛనీయమైనమార్గం' అని ప్రభుత్వం భావించింది.

"ఈ విషయంలో సర్వసేనాని మొదట్నుండి చివరవరకూ తనకు సరియైనదని తోచిన విధంగా భారతదేశపు, భారత సైన్యపు క్షేమాన్ని మనస్సులో ఉంచుకొనే వ్యవహరించారనే సంగతిని ప్రభుత్వము సందేహించకపోయినా కూడా ప్రత్యేక పరిస్థితుల ననుసరించి, ఈ ఒక్క విషయంలో మాత్రం ఫెడరల్ కోర్టు న్యాయమూర్తుల సలహాను పొందుటకు ప్రభుత్వం నిశ్చయించింది. ఉత్తరోత్తర జరుగవాటికిది తార్కాణంగాని, ప్రమాణంగాని కాదు. సర్వసేనాని వీటిని గురించి విచారించుటకు ముందు కోర్టు మార్షల్ విచారణలపై ఫెడరల్ కోర్టు సలహానుకూడా పొందుట అవసరమని ప్రభుత్వం భావించింది.

ఈకేసుల పునర్విచారణను ఆజాద్ హింద్ ఫౌజుకు చెందిన వారితో ఒక కోర్టు మార్షల్‌ను యేర్పాటుచేసి జరిపించారా అని యామిన్‌ఖాన్‌గారు ప్రశ్నింపగా పండిట్ నెహ్రూ ఇలా జవాబు చెప్పారు: "నేరాలు వైదులో వైదీలపై జరిపిన చర్యలకు సంబంధించినదిగాని, యుద్ధకార్యములకు సంబంధించినవికావు. కనుక యీవిషయమై విచారణ జరుపగలవారు భారత జాతీయసైన్యం అంటే అభిమానం గాని, లేక ప్రతికూల్యంగాని లేనట్టివారే.

ఈకేసులను ఫెడరల్ కోర్టుకు పంపడం అనే సూచన తమకు సమ్మతం గాదనీ, పండిట్ నెహ్రూ ఉపన్యాసం చాలా ఆశాభంగాన్ని కలిగించిందని, నెహ్రూ ఆరితేరిన "బ్యూరో క్రాట్" లాగా మాట్లాడినాడనీ సిద్దిక్ అలీఖాన్‌గారన్నారు. ప్రధాన రాజకీయ పక్షముల ప్రముఖులతో కూడిఉన్న ప్రభుత్వం ఇలా ప్రవర్తిస్తుందని తాను తలంచలేదన్నారు. వీరిని విడుదల చేయలేకపోతే ప్రభుత్వం రాజీనామా ఇచ్చి, అలా విడుదల చేయగలవారికి స్థానం ఇవ్వాలనీ చెప్పారు.

మహమ్మద్ రామన్, కృష్ణచంద్ర శర్మ గార్లు ప్రసంగించిన అనంతరం సిద్దిక్ అలీగారికి సమాధానం చెప్తూ అనంతశయనం అయ్యంగార్ ప్రసంగించారు.

ఫెడరల్ కోర్టుకి విషయాన్ని నివేదించాలన్నది కేంద్రప్రభుత్వం అంతటి అభిప్రాయం అని గాడ్గిల్ గారు అన్నారు.

అబ్దుల్ గనీఖాన్ గారు తమ తీర్మానాన్ని ఉపసంహరించుకొన్నారు.

విద్యాశాఖ మంత్రుల సభ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 2: భారతప్రభుత్వ విద్యాశాఖాసభ్యుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్, అధ్యక్షతనుమే మధ్య భాగంలో సిమ్లానగరమందు వివిధరాష్ట్ర విద్యాశాఖామాత్యుల, విశ్వవిద్యాలయోపాధ్యక్షులసమావేశంజరుగగలదని తెలుస్తోంది.

'అభ్యుదయ కరమైన అన్ని ఉద్యమాలలో ఆంధ్రులు ముందంజవేశారు'

ఆహ్వాన సంఘాధ్యక్షుడు కె. అప్పారావు గారి స్వాగతోపన్యాసము

శుక్రవారం చెన్నపురిలో ప్రారంభమైన ప్రత్యేకాంధ్ర మహాసభకు వచ్చిన ప్రతినిధులనూ, ఇతర ప్రముఖులనూ ఆహ్వానిస్తూ ఆహ్వాన సంఘాధ్యక్షుడు శ్రీ కర్లపాటి అప్పారావుగారు ఈవిధంగాఉపన్యసించారు:

ఆంధ్రసోదర సోదరీమణులారా! స్వాగతము, సుస్వాగతము, వ్యవధిలేకున్నదనా ఆహ్వానమును మన్నించి అనేక వ్యయప్రయాసలకు లోనై ఈ మహాసభకు ఆగుదెంచిన మీ కందరకు ఆహ్వాన సంఘం తరపున వందనము లర్పింస్తున్నాను. నాకంటే వయస్సులోను అనుభవంలోను పెద్దలై ఆంధ్రరాష్ట్ర నిర్మాణంకోసం అనేక పత్రికాలుగా పాటుపడుతున్న మహామహులు ఎందరో ఉండగా, నన్ను ఆహ్వాన సంఘాధ్యక్షునిగా ఎన్నుకొని, గౌరవించినందులకు ఆహ్వాన సంఘంవారికి నా ప్రత్యేక వందనా లర్పిస్తున్నాను.

పరిపాలనాధికారం ప్రజల హస్తగతం కావటంతోనే భాషాప్రయుక్తంగా కాంగ్రెసు అభయహస్తమిచ్చింది. భాషాప్రయుక్తంగా కాంగ్రెసురాష్ట్రాలను సైతం నిర్మించి, ఆసూత్రాన్ని ఆచరణలో పెట్టింది.

ఈ సూత్రాన్ని లక్ష్యమందుంచుకొనే ప్రత్యేకాంధ్రరాష్ట్ర నిర్మాణకోసం 1913 మొదలుకొని 24 మహాసభలద్వారా ఆందోళనచేస్తూ వచ్చాము. మదరాసుశాసనసభలోను, ఎసెంబ్లీలోను అనేకసార్లు ఆంధ్రరాష్ట్రతీర్మానం ఆమోదించబడింది.

అయినప్పటికి ఆంధ్రరాష్ట్రం ఇంతవరకు నిర్మాణం కాలేదు. జనసంఖ్యబట్టి మాచినా, ఆర్థికస్థితిని ఆలోచించినా, సైనికపరిస్థితులను పరికించినా, సంస్కృతీ సభ్యతలను తలపెసినా, పూర్వపు ఔన్నత్యమేకాదు, నేటి అవసరమే కాదు, ఏవిధంగాచూచినా, ఆంధ్రరాష్ట్ర నిర్మాణాన్ని కాదనటానికి వీలులేదు. ప్రత్యేకరాష్ట్ర నిర్మాణానికి ఆంధ్రులకున్న అవకాశాలు, సహజమైన సౌకర్యాలు తక్కినవా రెవ్వరికీలేవని చెప్పవచ్చును.

అయితే ఆంధ్రరాష్ట్రం యింకా అందని మావిపండుగానే ఉంది. మనకంటె ఎంతో వెనక్గా రాష్ట్రోద్యమాన్ని ప్రారంభించిన ఉత్కళులకు, సింధుప్రజలకూ, ప్రత్యేకరాష్ట్రాలు సిద్ధించినవి. దీనికి కారణమేమి?

ఆంధ్రులలో నేకభక్తికి లోటులేదు. త్యాగానికి ఆంధ్రులు పెట్టినది పేరు. కాంగ్రెస్ ఆదేశాన్ని పాలించారు ఆంధ్రులు. మహాత్మా గాంధీ అజ్ఞలను శిరసావహించింది ఆంధ్రజాతి. అభ్యుదయ పరమైన అన్ని ఉద్యమాల్లోనూ ఆంధ్రులోకం ముందంజవేసింది. స్వతంత్రం లేని స్వరాష్ట్రం పనికిరాదని, స్వరాష్ట్రం లేని స్వతంత్రంకూడా పనికిమాలినదని గ్రహించి, భారతదేశ స్వాతంత్ర్యానికి, ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి కూడా ఏకకాలంలో పాటుపడుతూ వచ్చారు ఆంధ్రులు. అంతేకాకుండా స్వాతంత్ర్యంకోసం, స్వరాష్ట్రోదయాన్ని వాఙ్మయికంగావెనక్కి నెట్టటానికికూడా సంశయించలేదు. ఇందువల్ల ఆంధ్రులకు కలిగిన నష్టాలు, వాటిల్లిన కష్టాలు అనేకం అయినా వాటిని పాటించక అందరి భాగుకోసం పాటుపడ్డారు ఆంధ్రులు.

అయితే ఆంధ్రరాష్ట్ర నిర్మాణం ఇంతవరకు జరగక పోవడానికి ఆంధ్రులలో ఐక్యమత్యమనేది లేకపోవుటకు కారణమని మనవి చేయుటకు చింతిస్తున్నాను. ఈ అనైకమత్యం మూలాన్నే, రాష్ట్రం సిద్ధించకపోటం అలావుండగా, చేజిక్కిన ప్రధానామాత్య పదవిని సైతంమనం నిల్పుకోలేనివారమై, ప్రభుత్వంలో నాయకత్వాన్ని కోల్పోయినాము. ఈ పతితస్థితివల్ల ఇంతటనైనా మనం కన్నులు తెరిస్తే, కీడులో మేలుగా ఎంచవచ్చు.

భాషాప్రయుక్త రాష్ట్ర నిర్మాణ సూత్రాన్ని ఏనాటినుంచో కాంగ్రెసు మహాసభయున్నూ, గాంధిమహాత్ముడున్నూ అంగీకరించి వుండగా, కాంగ్రెసు పెత్తనదారులు కొందరు ఇప్పుడు ఈ ప్రధాన సూత్రానికు వ్యతిరేకంగా మాట్లాడటం చాలా విపరీతంగా కనపించకపోదు. ఈ సమస్యన రాష్ట్రపతి ఆచార్య కృపాలానీగారు చెన్నపురిలో ఉపన్యసిస్తూ, భాషాధారక రాష్ట్రవిభజన సూత్రాన్ని ఆక్షేపిస్తూ మాట్లాడినప్పుడు వారివెలను నేను నమ్మలేకపోయినాను. ఇంతకాలం గడచిన పిమ్మట, కాంగ్రెసు అధ్యక్షపీఠం అక్రమించివుండే ఒక ఘనవ్యక్తుడు భాషాధారరాష్ట్రసూత్రాన్ని మూలచ్ఛేదం చేస్తూ మాట్లాడటం ఆంధ్రాళయనూ, ఆంధ్రులకు గొడ్డలిపెట్టని మనంభావించక తప్పదు. ఇది ఆచార్య కృపాలానీగారి వ్యక్తిగతాభిప్రాయమేగాని, కాంగ్రెసు కార్యవర్గం వారి ఆమోదంతో, వారి పక్షాన వల్లడించిన అభిప్రాయం కాదని నమ్ముచున్నాను.

మరొక్కవిషయం మనవిచేసి, మా ఉన్యాసాన్ని ముగిస్తున్నాను గత సంవత్సరం గుంటూరు ఆంధ్రమహాసభకు అధ్యక్షత వహించిన సర్ విజయరాగారు తమ అధ్యక్షోపన్యాసంలో చెన్నపురపు తరాదా ఆంధ్రరాష్ట్ర నిర్మాణ సమస్యకు ఆటంకమైట్టుంటే, చెన్నపురాన్ని మనం వదులుకోవచ్చునని చేసిన సూచనకు హిందూ, ఎక్స్‌ప్రెసు మొదలైన పత్రికలు హర్షాంగీకారాలను ప్రకటించినవి. ఆంధ్రులకు, చెన్నపురంపైన గల హక్కులను గురించి నే డిప్పుడు చెప్పటం చర్వితచర్వణం అవుతుంది. చెన్నపురమేగాక, తిరుపతివరకుకూడా తమిళదేశపు పరిహద్దు లుండవలెనని ఇరుల ఈ నగరమందు సమావేశమైన తమిళనాడు రచయితల మహాసభవారు తీర్మానించినారు. నేడు అమాత్య పదవుల నాక్రమించినవారిలోకూడా కొందరీ అభిప్రాయాన్ని వెలిబుచ్చువారు సర్ విజయరాగారు చేసిన సూచన ఈ సమస్య పరిష్కారానికి సాయపడు. మద్రాసు ప్రభుత్వానికి అధ్యయిజరుగా పనిచేసిన సర్ నార్మన్ స్ట్రాతీగారు మద్రాసును ఢిల్లీవలె ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పరచవలెనని ఒకసూచన చేసివుండిరి. ఉభయులకు ఉమ్మడిసరగరంగా వుండవలెనని సర్ బి. యన్. రావుగారు మరొకసలహానిచ్చారు. కాబట్టి, నేటి మహాసభయందు సమావేశమైన పెద్దలుతొందరు ఈ విషయమై సావకాశంగా ఆలోచించి ఏదైనా ఒక నిర్ణయానికి రావలసిందని కోరుతున్నాను.

ఏమైనప్పటికీ, ఈవిషయం పరిహార్దు నిర్ణాయకసంఘంవారిద్వారా సమరసంగా పరిష్కరించుకోదగిందే గాని, మనలో మనం వివాదించుకోవలసిన అంశంకాదు

మీరందరు మా ఆహ్వానాన్ని అంగీకరించి బహుశ్రమల కోర్చి విచ్చేసినందుకు మరొకసారి నా కృతజ్ఞతాపూర్వక వందనములను అర్పిస్తున్నాను.

కలకత్తా పరిస్థితులు చక్కబడుతున్నవి

కలకత్తా, ఏప్రిల్ 3 కలకత్తా పరిస్థితులు చక్కపడుతూఉన్నవి. నిన్నటి మధ్యాహ్నమునుంచీ అయుర్లో గురువారముగా కొట్లాటలు జరిగినవి. పోలీసు మిలటర

పశుసంపదవల్లనే మన దేశం సుభిక్షంగా ఉంది"

దేశోద్ధారక పశుప్రదర్శనోత్సవ సందర్భంలో ప్రకాశంగారి ప్రసంగం

తెనాలి, ఏప్రిల్ 3.

నిన్నటిఉదయం పాకెంజరులో మదరాసు మాజీప్రధానమంత్రి శ్రీ టంగుటూరు ప్రకాశంపంతులుగారు తెనాలికి వచ్చారు. రైల్వే ప్లాటుఫారంమీద శ్రీ ప్రకాశం పంతులుగారు రైలు దిగగానే కాంగ్రెసు ప్రముఖులు శ్రీ పాతూరి సుబ్బయ్యచౌదరి, కరణం రామస్వామిచౌదరి, శ్రీ నల్లూరి రాజయ్యచౌదరి, శ్రీ రావి సత్యనారాయణ చౌదరి మునిసిపల్ చైర్మెన్ శ్రీ వేదాంతం లక్ష్మీనారాయణ, శ్రీ చింతమనేని భావయ్యచౌదరిగార్లు మొదలగువారు ఘనమగు స్వాగతం ఇచ్చారు. శ్రీ ప్రకాశంపంతులుగారిని కారులో కూర్చుండబెట్టి బ్యాండు వాయిద్యములతో వూరేగిస్తూ శ్రీ దళోద్ధారక జాగేశ్వరరావుపంతులుగారిస్మారకార్థం ఏర్పరచిన పశుప్రదర్శనశాలవద్దకు తీసుకెళ్లారు. అచ్చట తమ దర్శనంకొరకు వేచివున్న వేలకొలది ప్రజాసమూహమును వుద్దేశించి శ్రీ ప్రకాశంపంతులుగారు ఉపన్యసించారు.

శ్రీ ప్రకాశంపంతులుగారి ఉపన్యాసము

మన దేశంలో స్వరాజ్యం ప్రజాప్రభుత్వం ఎటువంటివి కావాలో అట్టిదాని కోసమై గాంధీగారి నాయకత్వం క్రింద నేడు కాంగ్రెసు మహాసభ పనిచేస్తున్నది. అదేరకమైన కాంగ్రెసుకూ ప్రజలకూ సంబంధం వుండేదిగాదు. యిప్పటికి ప్రజలందరికి విజ్ఞానం కలిగి ప్రజాప్రభుత్వం ఏర్పడుచుటకు కాంగ్రెసు నిశ్చయించింది. కాంగ్రెసు ప్రజలపరమైనది. ఇతర దేశాలు చిన్నవి. మన దేశం అన్నిటికంటె గొప్పది. ఇంగ్లీషువాండ్లు కొద్దిమందైనా మన దేశాన్ని పాలింపగలిగారు. మన దేశంలో ఎన్నో మతాలు కులాలు వున్నవిగదా. వీరినందరిని కూడగట్టి స్వరాజ్యమును స్థాపించుట ఎట్లా అని నేను ఇంగ్లండులో వున్నప్పుడు శ్రీ లాలా లజపతిరాయి గారు నాతో అన్నాడు. కాని గాంధీగారి నాయకత్వాన ప్రజలందరమూ గాంధీగారి అహింసతో ఆత్మశక్తితో మన దేశానికి స్వతంత్రం సంపాదిస్తామని శపథం చేశాము. మనం ఇంకా పదవీ వ్యామోహంలో వున్నాము. గనుక యింతకాలం పట్టింది. కోట్లకొలది జనానికి యీ శక్తి వస్తుందనే నేను లాయరుపని మానేసివచ్చి, ఈ కాంగ్రెసు పనిచేస్తున్నాను. నేటికి ఇంగ్లీషువార్లను వెళ్లిపొమ్మని చెప్పగలిగాం, వెళ్లిపోతున్నారు. అది ఆగస్టుతీర్మాన ప్రతిఫలం. ఇది ఆఖరు యుద్ధం అని అందరిని చెరపాలల కంపినారు. తర్వాత మనశక్తి తెలుసుకొని జైళ్లనుండి అందరిని వదలిపెట్టి కాసనసభల ఎన్నికలు పెట్టినారు. ఎన్నికలలో మమ్మల్ని అందరిని గెలిపించారుమీరు. నాయకత్వం విషయంలో నాపేరును పెట్టేరు. ప్రజలకు ఏవిధంగా సేవచేయాలో అదిఅంతా నాకు తెలుసునుగనుక కూడు, గుడ్డ అందరికి లంభించాలని ఆలోచించాను. కాంగ్రెసుప్రభుత్వం మీ తరపున 11 మాసములు నడిపాం; ఖద్దరు విషయంలో ప్రజలు నీతరపున వుంటారా, అని గాంధిగారు అడిగితే, మీ తరపున నేను హామీఇచ్చాను. ప్రజల కందరికీ కూడుగుడ్డ దొరకేటట్టు చేద్దామని రాష్ట్రప్రభుత్వం నిర్వహించాము. యీ నాడు గొప్ప సుదినం. మీరు విచారించ నవసరం లేదు. ప్రకాశంగారి ప్రభుత్వం లేకపోయినా ప్రజాప్రభ్వం పోయిందని అనుకోరాదు. సూర్యుడున్నంతవరకు ప్రజాప్రభుత్వం పోదు. యీ బలంమీది. మీరు ఏమార్పు రావాన్నా తక్కువ రాగలదు. మనస్సు సృష్టింపగలదు, మనస్సే నశింపజేయగలదు. సూర్యకిరణాలన్నీ ఒకచోట చేర్చి ఆటంబాంబు తయారుచేశారు ప్రభుత్వం వారు. దాని దెబ్బలుతినేభాగ్యం మనకు లేదు. మన బలంకూడా ఆ కిరణాలలోనే వున్నది. జగత్తంతా ఏ భగవంతుని వల్ల సృష్టింప బడుతుందో ఆ విధంగానే నశించగలదు.

శ్రీ నాగేశ్వరరావు పంతులు తులుగారి స్మారకార్థం యీ పశు ప్రదర్శనం జరపడం సంతోషదాయకమైనది. పశుసంపదతో గూడినది మన దేశం. పశుసంపదతోనే మనదేశం సుభిక్షంగావున్నది. మన దేశంలోని పశువులు యితరదేశాలలోని వారికి ఆహారం క్రింద వినియోగింప బడుతున్నాయి. పశువుల విషయంలో భరతవర్షపు రాజులు పరీక్షిత్తు మొదలగువారు చాలా శ్రద్ధతో వున్నారు. పరీక్షిత్తు కాలంలో మనుష్యుల నందరిని సమానంగా చూచేవారు. తరువాత రానురాను రాజులు చెడిపోవుటచే మనుష్యులు చెడారు. భూమిని నాగలితో దున్నేవాడు గోవును పాలు పితికేవాడు యీ కాలంలో లేకపోవుటచేత యిట్టిస్థితి వచ్చిందన్నది. గో రూపముతో వున్నది భూదేవి పరీక్షిత్తుతో. యీ కాలంలో నూతనవిధానం ఏలాగా అని విచారించి మదరాసురాష్ట్రం యితరరాష్ట్రాలకు ఆదర్శంగా ఉండాలని చూచాను.

అరవ నాయకత్వం నశించాలని సభలో నుండి కేకలు వేయగా ప్రకాశంగారు ఇలా ఉపన్యసించారు. మొదట్లో అరవలతో డ్వాటుతో నాయకునిగా వచ్చాను. వారిని నందింపవద్దు. యీ ప్రజలు బ్రతికున్నంతవరకు ప్రజారాజ్యమును ఎవరును పడగొట్టలేరు. మీ కోర్కె ఎలా ఉంటుందో అది జరిగి తీరుతుంది. ఇది మీ ప్రభుత్వం, మీ రెప్పుడు కోరితే అప్పుడు మార్పువస్తుంది. మీ రంతగా మమ్మల్ని వత్తిడిచేస్తే మాకప్పుడు బుద్ధి వస్తుంది. ప్రభుత్వం లోంచి బయటికి వచ్చి మీతో చేరిపోయినాను. నా అనుభవమంతా మీతో నావకాశంగా చెబుతాను. ప్రస్తుతం మీకు రానున్న యిబ్బందులురాకుండా చేస్తానుఅన్నారు.

సాయంకాలం సభ

మధ్యాహ్నం భోజనానంతరం మునిసిపల్ రహదారి బంగళాలో కొంతసేపు విశ్రాంతి తీసికొని శ్రీ ప్రకాశంపంతులుగారు దుగ్గిరాల వెళ్ళారు. సాయంకాలం 5 గంll లకు ప్రదర్శనశాలవద్ద బహిరంగ సభ శ్రీ పాతూరి సుబ్బయ్యచౌదరిగారి అధ్యక్షతను జరిగినది. సభకు సుమారు 20,000 ల మంది ప్రజలు వచ్చారు. ప్రథమంలో శ్రీ ప్రకాశంపంతులుగార్కి జిల్లా కాంగ్రెసుసంఘం, న్యాయవాది సమాస్తాలసంఘం, చేనేతపారిశ్రామిక సంఘం, బోసుగ్రంథాలయం తరపున స్వాగతపత్రములు సమర్పించారు. తరువాత శ్రీ ప్రకాశంపంతులుగారు మాట్లాడుతూ మిమ్ముల నందరిని వకచోటనూడ గల్గినందులకు సంతోషిస్తున్నాను. యీ దేశం పూర్వకాలం దేశంవంటిదికాదు. చదువుకున్నవారికి చదువుకోనివారికి రైతులు వర్తకులు కూలీలు అందరికి స్వరాజ్యంవస్తుంది. పూర్వం ప్రతిగ్రామంలో వీధి బడులుండి అందరికి విద్య సులభంగా లభించేదనియు. మన దేశచరిత్ర లాంటిది యేదేశానికీ లేదు. మనదేశంలో గాంధీగారి నాయకత్వం క్రింద ప్రజలకు కూడు గుడ్డ దొరకడానికి మార్గం ఏర్పడింది. జైళ్లభయం పోయింది. అహింసాయుతంగా పోరాటంసాగించి ఇంగ్లీషువాండ్లను లాంగదీసి మనలో ఎన్నికలాలు మతాలున్నా అన్నిటినీ మరచి స్వరాజ్యం సంపాదించడానికి అర్హులమైనాము. దైవబలంవలన గాంధిగారి ఆజ్ఞలను శిరసావహించి రాష్ట్రపరిపాలన సాగిస్తున్నాము. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం చరిత్ర వ్రాయించే అవకాశం కలుగలేదు. రాష్ట్రంలో స్వతంత్రం సంపాదించగలిగాము. ఢిల్లీలో సంపూర్ణ స్వతంత్రం సంపాదింపగలరు. ప్రజల వోట్లను తీసికొని ప్రజలకోసం నౌకరులలాగ పనిచేశాము. ప్రజలు దిగి రమ్మంటేవచ్చి జమాఖర్చులు చెప్పతాము. పదవులకోసం అమ్ముడుపోరాదని తెలుసుకొని మంత్రిపదవులకు రాజీనామా లిచ్చాము. మంత్రిపదవి పోయిందనె విచారం ఏమాత్రమూ లేదు. పాత మంత్రివర్గం పోవడం కొత్త మంత్రివర్గం రావడం మంచిదే. యీ గందరగోళమంతా ప్రతి గుడిశలోకి ప్రాకిపోయింది. త్రిశంకుని స్వర్గంలాగ మధ్యకు త్రోసివేయబడెను. మంత్రిపదవులు వస్తాయి, పోతాయి. రాష్ట్ర కాంగ్రెసుపక్ష ఆచార్య రంగాగారు అధ్యక్షులు. వారు ప్రజాభిప్రాయం ప్రకారం తీర్మానం చేసి ప్రజాభిప్రాయానుసారంగా నడవాలంటే జవాబుచెప్పినవాడు లేడు. మంత్రిపదవి కావాలని నాకు లేదు. రాష్ట్రపతి కృపలానీగారు అడిగినతోడనే రాజీనామా ఇచ్చాను. ఇవ్వక పేచీపెడితే మూడు సంవత్సరాలదాకా కాలం గడిచేది. కోర్టు వ్యవహారాలు నాకు తెలిసినంతగా యితరులకు తెలియవు. ప్రజ లిచ్చిన అధికారం కాబట్టి, ఎవరిమీద నాకు అయిష్టంలేదు. అన్నివిషయాలనూ అసెంబ్లీలో దీర్ఘంగా చెప్పాను. ఈసారి గుంటూరుజిల్లాలో వారంరోజులు తిరిగి ప్రతిగ్రామంలోను ప్రజలతో సంప్రదిస్తాను. గుంటూరుజిల్లాలో తలకాయ క్రిందికి, కాళ్ళు మీదికి వచ్చినట్లుంది. యీజిల్లా నాజన్మస్థానము కాబట్టి నాకు చాలా విచారకరముగా వున్నది. ఈ జిల్లాలో యిన్ని మతాలున్నవడం సహింపరాదు. మాలో కొందరికి హైకమాండువారి అధికారం ప్రధానమేగాని ప్రజల అధికారంతో పనిలేదు. ప్రజలతో సంబంధంలేదనే పద్ధతి నుంచిదిగాదు. ప్రజలకు క్రమశిక్షణవున్నది. యింకా చాలావిషయాలు మీకు తెలియజేయుటకు కుతూహలపడుతున్నాను. మనష్యులకు లొంగెవాడినిగాను. అందరిని పిలిచి వినయముగా అయికమత్యముతో వుండామనుకొన నెబితే వినలేదు. నాకు అపజయమనేది లేదు. ప్రజాశక్తి ఎలా వుంటుందో అది జరిగితీరుతుంది. మరల ఎన్నికలు వచ్చినప్పుడు మీదగ్గరకువచ్చి దేశానికి శత్రువులెవ్వరో మిత్రులెవ్వరో ఎవరికి మీవోట్లివ్వాలో తెలియజేస్తాను అన్నారు.

సహకార సంఘాలు

సహకారసంఘాల విషయంలో డెన్మార్కులోవలె మనదేశంలోకూడ స్థాపించి ప్రజలే లాభం అనుభవించేటట్లు చేస్తే మనలో ధనికవర్గాల వ్యతిరేకం వచ్చింది. క్రొత్తమంత్రివర్గంవారు గూడ కొంత దిగజారే వ్యవహారం చేస్తున్నట్లువినవస్తున్నది. నేను బయటవుండి గూడ మీకు తగినసహాయం చేస్తాను మీతరపున రాయబారం నడుపుతాను ప్రజలు ఎక్కువలాభం కోసం ధాన్యం బ్లాకుమార్కెట్టులో అమ్మరాదు. సహకార సంఘాలు పడిపోకుండా చూచుకోవాలి.

వార్తాపత్రికల విధాయకం

ప్రజావుద్యమాలు అభివృద్ధికి రావాలంటే వార్తాపత్రికలు సాధనసంపత్తిగా వుంటే యెంతో మేలుకలిగేది. యిప్పటి మన వార్తాపత్రికలు ఏమాత్రము ప్రజలకు మేలుచేకూరుటలేదు. ప్రజల స్థితులను బలపరచే వార్తాపత్రికలు లేవు. యిప్పటి పత్రికలువారిస్వలాభంకోసంనడుస్తున్నయి వాటివిషయం మీరు సరిగా గ్రహించారు. ఒక పత్రికాయన మంచి వ్యాసం ప్రజలకోసం వ్రాస్తే ఆపత్రికలు మేము 5000 ల ప్రతులుకొని అన్ని జిల్లాలకు పంపించితే వారికి లంచమిచ్చామని వక శాసనసభ్యుడు అడిగాడు. ప్రజల వాళ్ళకులను కాపాడే పత్రిక ఏర్పడాలని నాకోర్కె. ప్రజలకు సంబంధించిన పత్రిక ఆరుమాసాలలో స్థాపించుటకు ప్రయత్నములు జరుగుచున్నాయి. దానికి మీరంతా సహాయము చేయాలి. జమీందారిబిల్లు యీ సమావేశంలో చర్చకు రానున్నది. కాబట్టి కాంగ్రెసులో నున్న పోటీదార్లు జాగ్రత్తగా పని చెయ్యాలి. కొలదిరోజులలోనే ఆచార్య రంగాగారూ, నేనూ ఆంధ్రదేశంలో సంచారంజేసి ప్రజలకు కావలసిన సహాయం చేస్తాము. అని ఉపన్యాసమును ముగించారు.

తీర్మానాలు

ఉత్పత్తి కొనుగోలుదారుల సహకార సంఘాలకు గాకుండా ప్రస్తుతం మిల్లు యజమానులే ధాన్యం కొనుగోలు చేయాలనే ప్రస్తుత మంత్రివర్గ విధానాన్ని ఖండిస్తూ శ్రీ చింతమనేని శివరామయ్య చౌదరిగారి తీర్మానాన్ని సభవారు ఆమోదించారు; ప్రజాప్రతినిధులు ప్రజల కష్టములను తెలుసుకొని వారియిష్టాను సారం ప్రజాపరిమత్తులో రాజ్యాంగం నిర్మించాలని తీర్మానించిరి. రాత్రి శ్రీ వేదాంతం లక్ష్మీనారాయణగారి ఆతిథ్యాన్ని స్వీకరించి రాత్రి మెయిలులో ప్రకాశంగారు మదరాసు వెళ్లారు.

(స్వ. వి.)

బర్మాలో కొత్తనాణెములు

బర్మా రిజర్వుబ్యాంకుశాఖ రద్దు

రంగూను, ఏప్రిలు 2: నిన్న ఏప్రిలు 1 తేదీనుండి బర్మాలోని రిజర్వుబ్యాంకు శాఖ ఎత్తివేయబడెను. బర్మాప్రభుత్వము క్రొత్త నాణెములను ముద్రించుకొని చిలా మణీ చేసికొనుచున్నది అందుకొరకై బర్మా కరెన్సీ బోర్డు ఏర్పాటుచేయబడెను.

ఇండియా ప్రభుత్వానికి బర్మాప్రభుత్వంచెల్లించవలసినబాకీ మొత్తం 31-3-1947 వరకు రూ 25 కోటు లెక్కతేలినది. యీ మొత్తమును బ్రిటిషు పౌను ద్రవ్యమానంలో బర్మాప్రభుత్వం చెల్లించవచ్చునని ఇండియా ప్రభుత్వ ఖజానాశాఖా సభ్యులగు లియాకతాలీఖానుగారు ఒప్పుకొన్నారు. అందుకై బర్మాతరపున కృతజ్ఞతను వెల్లడించుచున్నామని బర్మా ప్రభుత్వ ఖజానాశాఖా సభ్యులగు తాకీ నుమియాగారు అన్నారు.

జిన్నాకు పటేల్ సమాధానం

(1 వ పేజీ తరువాయి)

బ్రిటిషువారు విమర్శగా ప్రకటించారు. వారి సంకల్పశుద్ధి ఈప్రకటనవల్ల విస్పష్టంగా బుజువైపోయింది. ఈ ప్రకటనవల్ల మన భుజాలమీద బ్రహ్మాండమైన కార్యభారం పడ్డది. దేశంలో సంక్షోభం ప్రజ్వలించింది, ఎవరికివారు అధికారాన్ని స్వాధీనం చేసుకోడంకోసం, పోటా పోటీలు పడి పోరాటానికి దిగారు. బ్రిటిషువారి మీద మనలో చిరకాలంగా నాటుకొని ఉన్న అవిశ్వాసం తొలగిపోయి దానిస్థానే ఒకరిమీద ఒకరికి మనలో మనకే వైషమ్యాలు అపనమ్మకమూ ఏర్పడినై. దీనివల్ల విదేశాలలో నానాటికీ ఇటు భారతీయుల పేరు ప్రతిష్టలు తరిగిపోయి అటు బ్రిటిషువారి గౌరవం పెరిగిపోతోంది.

విదేశీయ పరిపాలకులవద్దనుంచి అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి మన మందరమూ ఐక్యమై సమాయత్తం అవడం బదులు మనలో మనం పోరాడుకోడం చాలా శోచనీయం! దీనివల్ల అనేక దుష్పర్యవసానా లుద్భవించకతప్పదు. ద్వితీయ ప్రపంచసంగ్రామ ఫలితంగా భారతదేశానికి సంభవించిన కష్టాలు ఇన్నీ అన్నీ కావు; యుద్ధంవల్ల మనకు సంక్రమించిన దుష్ఫలితాలలోనూ అవి నీతిఒకటి. సామాన్య ప్రజానీకంయొక్క శ్రేయస్సుమీద ఎన్నడూలేని నిర్లక్ష్యం బయలుదేరింది; అసత్యమూ, స్వార్థపరత్వమూ, అక్రమ ధనార్జన దేశంలో ప్రబలిపోయినై. ఎవరికి వారు బీదసాదలనోట మన్నుగొట్టి ధనధాన్యాలుకూడ బెట్టుకోడం ప్రారంభించారు. ఈనాడు దేశంలో అన్నవస్త్రాలకు కరువు ఏర్పడింది. అందరూ నిరుపేదవారిని కొల్లగొట్టి డబ్బుపోగుచేయాలని చూస్తున్నారు. అయితే ప్రపంచంఅంతటా కూడా ఇప్పుడు ఇలాగే జరుగుతున్నది.

ఆసియాఖండంలోని వివిధదేశాలు, యావత్ప్రపంచమూ కూడా ఈ నాడు భారతదేశంమీదకి దృష్టి కేంద్రీకరించి ఆతురతతో నిరీక్షిస్తున్నవి. భారతదేశం ప్రపంచంలో ఒక మహోన్నత స్థాయినందుకొని ఇతర దేశాలకు అనేక విషయాలలో మార్గదర్శకత్వం వహించగలస్థితిలో ఉన్నది. భారతదేశంలో సహజసంపదలు, అంగబలము, ప్రతిభ, పుష్కలంగా ఉన్నవి. యూరప్‌లో ఉన్న దేశాలన్నీ అణగారిపోయినై. ఆసియాఖండంలో విజాతీయుల పరిపాలన క్రింద మట్టగింపబడుతున్న దేశాలు, భారతదేశనాయకత్వంకోసం ఎదురుచూస్తున్నవి. ప్రపంచశాంతి అంతా భారతదేశశాంతిమీదనే ఆధారపడిఉన్నది. బ్రిటిషువారు భారతదేశాన్ని వదిలిపెట్టిపోతున్నారని ప్రపంచం అందరికి తెలుసును. సామ్రాజ్యపురోజులు పోయినై. బ్రిటిషువారి వద్ద మన మెన్నోగుణపాఠాలు నేర్చుకోవలసి ఉన్నది. గత యుద్ధంలో వారు అనేక కష్టాలు అనుభవించారు. ఇప్పటికి వారు చెప్ప నలవికాని బాధలు పడుతున్నారు. భారతదేశాన్ని విడిచిపెట్టే ఈ సందర్భంలో వారీనాడు చూపుతున్న చాకచక్యము సాహసమూ నిజంగా ప్రశంసనీయ మైనవి."

కాంగ్రెసులో ఏర్పడిన కూటాలు అంతర్వర్గాలు వీటిమాట ఎత్తుకొని సర్దార్ పటేలు ఇలా అన్నాడు:—

"భారతదేశాన్ని విజాతీయ పరిపాలన నుంచి విమోచనం చెయ్యాలని కాంగ్రెసు పెట్టుకున్నపని ఈ నాటికి పూర్తిఅయిపోయింది. వృద్ధ స్వాతంత్ర్య యోధుల మనోరథం ఈడేరింది. ఇకమీదట స్వతంత్ర భారతదేశము యొక్క యాజమాన్యాన్ని యువకుల కప్పగించివేయాలని కాంగ్రెసు అధిష్ఠానవర్గం కోరుతున్నది. అయితే భారతదేశముయొక్క యాజమాన్యాన్ని నిర్వచించడం అంత సులభమైన కార్యంకాదు.

జబ్బుతో చిరకాలం తీసుకుంటున్న రోగికి వ్యాధినయంచేయడం యెంతకష్టమో ఇదీ అంతకష్టం. భారతదేశం రెండు శతాబ్దాలుగా దాస్యవ్యాధితో తీసుకుంటున్నది. అధికార వాంఛ దేశంలో ఇప్పుడు ప్రతివ్యక్తినీ ఆవేశించింది. హిందువుల యొక్కయు, ముస్లిలయొక్కయు సంగతి అటుంచి, సంస్థానాధిపతులు కూడా ఇప్పుడు మేముకూడా ఉన్నామని బయలుదేరుతున్నారు.

కాంగ్రెసు సంస్థలో, అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి అనేక వర్గాలు యేర్పడినై. వీరిలో కొందరు దేశంలో రష్యామాదిరి సంస్కృతిని రష్యాలోమాదిరిగా విప్లవము లేవదీయడానికి ప్రయత్నిస్తున్నారు." ఈ తామపురోజుల్లో శ్రామికులు మాటిమాటికి హడావుడిగా సమ్మెలుచేయడం ఒక మహాపాతకమనీ ప్రజాబాహుళ్యం యొక్క శ్రేయస్సుకే ఇది భంగకరమనీ, సర్దార్ పటేల్ అన్నాడు.

"దేశం అంతటా శ్రామికవర్గాల నాయకత్వంకోసం పెద్దఎత్తున పోటీలు బయలుదేరినై. ప్రతిచోటాస్వార్థదృష్టితో సమ్మెలు ప్రోత్సహిస్తున్నారు. దేశం చాలా విషమదశలో ఉన్నదనీ, ప్రజాకోటియొక్క అవసరాలను తీర్చడానికి తాము కష్టపడి పనిచేయడం అవసరమనీ, కార్మికులు గుర్తించడంలేదు. ఉత్పత్తిని ఇతోధికం చేయడానికి యజమానులు కూడా కార్మికులతో సర్వవిధాలా సహకరించాలి.

రాష్ట్రప్రభుత్వాలు కేంద్రప్రభుత్వమూ ప్రజాభిప్రాయం ఎలా ఉన్నదో ఎప్పటికప్పుడు తెలుసుకోడానికి ప్రయత్నిస్తున్నది. కాంగ్రెసుయెడ కొంతఅసంతృప్తి బయలుదేరింది. కాంగ్రెసు ప్రభుత్వాలు ప్రజలకు కావలసిన అన్నవస్త్రాలు సమకూర్చలేకపోతున్నవని అంటున్నారు. ప్రజలలో ఇటువంటి చైతన్యం కలగడం మంచిదే, ఇది శుభోదర్కమైన చిహ్నం. కేంద్రప్రభుత్వం ఈ విషయంలో ప్రజల కెక్కువగా సేవచేయలేక పోతున్నదన్నమాట వాస్తవమే. కాని రాష్ట్రాలలో ఉన్న కాంగ్రెసు ప్రభుత్వాల విషయం వేరు. ఇవి పూర్తిగా ప్రజాభిప్రాయాన్ని అనుసరించే వ్యవహరించగలవు.

ప్రజలురాష్ట్రాలలో అనవసరమైన ఆందోళన లేవదీసినట్లయితే, కాంగ్రెసు మంత్రివర్గాలు పతనమైపోయి గవర్నర్ల రాజ్యంవస్తుందనిపటేలు హెచ్చరించాడు.

పంజాబులోవలె విపరీత సంఘటనలకు దారితీసే పరిస్థితులనుసృష్టించవద్దని పటేలు విజ్ఞప్తిచేశాడు. రాష్ట్రప్రభుత్వాలను ఇంతకంటె సమర్థంగా నిర్వహించగల వ్యక్తులెవరైనా ఉంటే, కాంగ్రెసు ప్రభుత్వాలు రాజీనామా ఇచ్చి వారికి అధికారం వప్పగించడానికి సంసిద్ధంగా ఉన్నవని పటేలు అన్నాడు.

అచంచలమనుకొనే స్టేట్ కార్యదర్శి ఉద్యోగశాఖలు నేడు కూకటివేళ్లతో సహా పెల్లగిలిపోతున్నవి. విదేశాలకురాయబారోద్యోగులుగా వెళ్లడానికి కూడా మనుష్యులు కావాలి. ఈ ఉద్యోగాలకు నియమింపబడేవారు ప్రత్యేకశిక్షణపొందిన వారై ఉండాలి, కేవలం కైలుకు వెళ్లినంతమాత్రాన ప్రతివారు ఈ ఉద్యోగాలకు అర్హులుకారు. భారతదేశీయులలో ఒక వెర్రి ఆవేశం ప్రవేశించి, మత కలహాలకోసం కొన్నిచోట్ల ఆయుధాలుసైతం తయారుచేస్తున్నారని విన్నాను. కాని ఈ ఆయుధాలు సాహసవంతులు ప్రయోగించే ఆయుధాలు కావు. స్త్రీలమీదనూ శిశువులమీదనూ వృద్ధులమీదనూ, అశక్తులమీద నూ కత్తిగట్టడం సాహసం అనిపించుకోదు, ముస్లింలీగు పంజాబులోనూ సరిహద్దురాష్ట్రంలోను అధికారాన్ని హస్తగతం చేసుకోడానికి ప్రయత్నిస్తోంది. అస్సాంమీదికి దాడిచేసి పాకిస్తాను స్థాపించడానికి యత్నిస్తున్నది. కాని ఇది సులభసాధ్యంగాదు."

అఖిలభారత ముస్లింలీగు అధ్యక్షుడైన ఎమ్. ఏ. జిన్నా కావించిన "యుద్ధ విరామసంధి ప్రతిపాదన" గురించి ప్రస్తావిస్తూ, పాకిస్తాన్ ప్రాతిపదికపైగాని అఖండహిందూస్థాన్ ప్రాతిపదికపైగాని రాజీ కుదరడం అసంభవం అన్నాడు. "ఆయుధ విసర్జన చేస్తేనే యుద్ధ విరామ సంధి సంభవ మౌతుంది. యుద్ధ విరామం అండేనే ఆయుధ విసర్జన అని అర్థం." అని పటేలు అన్నాడు.

"పాకిస్తాన్‌ను న్యాయమైన ప్రాతిపదికపైనే స్థాపించడానికి వీలవుతుంది. ఈ సమస్యను విచారించి తీర్పు చెప్పడానికి నిష్పాక్షికమైన విచారణ సంఘాలు అనేకంఉన్నవి. పాకిస్తాన్ సమస్యను నిష్పాక్షిక విచారణ సంఘం ఎదుట పెట్ట అంగీకరించేపక్షంలో కాంగ్రెసు యుద్ధ విరామ సంధిపత్రంమీద సంతకం పెట్టడానికి సంసిద్ధంగా ఉన్నది. ఇక హత్యలు, వధలు వెంటనే విరమించాలి; రాజకీయ సమస్యలు పోరాటంవల్లగాని ఆయుధ ప్రయోగంవల్లగాని పరిష్కరింపబడజాలవు. కాంగ్రెసు ప్రతినిధులతో సమాలోచనలు జరిపి రాజీకి దిగవలసిందిగా, లీగు ప్రతినిధులను కాంగ్రెసు ఆహ్వానించింది; ఈ ఆహ్వానం పంపినప్పుడే కాంగ్రెసు ఒకతిరుగులేని నిర్ణయం చేసుకున్నది. ఎట్టి పరిస్థితులలోనూ కాంగ్రెసు అన్యాయానికి ఆలఒగ్గదు; అన్యాయమైన షరతులకు అంగీకరించదు. ముస్లింలీగు చెప్పిన ప్రతిదానికి కాంగ్రెసు మారుమాట లేకుండా లొంగి పడిఉండాలనే గనక లీగు యొక్క ఉద్దేశ్యం అయినట్లయితే యుద్ధ విరామ సంధి ప్రతిపాదన చేయడంలో అర్థంలేదు."

సంస్థానాధిపతులలో ఇటీవల వచ్చిన వాగ్వాదాలను గురించిన్నీ, తిరువాన్కూరు సంస్థానం స్వతంత్రం అవుతుందని దివాన్ ఇటీవల చేసిన ప్రకటన గురించిన్నీ ప్రస్తావిస్తూ పటేలు ఇలా అన్నాడు:—

"తిరువాన్కూర్ సంస్థానం భారతదేశానికి ఒక పాదంవంటిది. తిరువాన్కూర్ భారతదేశముయొక్క రాజ్యాంగంనుంచి విడిపడిపోతే, దానికి శిరచ్ఛేదం చేసినమొండెంగతి పడుతుంది. సంస్థానాలు ఒంటరిగా మనజాలవని నేను నరేంద్రులకు వినయపూర్వకంగా సలహా ఇస్తున్నాను. నరేంద్రులు ప్రజాపరిమత్తును బహిష్కరించజాలరు. బ్రిటిషుఇండియాలో హిందూ ముస్లింవర్గాలకు ఏర్పడిన వైషమ్యాల ఆసరా చూసుకొని నరేంద్రులు స్వార్థదృష్టితో ప్రవర్తించినట్లయితే, అది చివరికి ఆత్మవినాశానికే దారితీస్తుందని నేను హెచ్చరించ గోరుతున్నాను. సంపూర్ణ సార్వభౌమత్వాన్ని సంపాదించగలమని నరేంద్రులెవరైనా భావిస్తున్నట్లయితే అది పట్టి దుర్భ్రమే అని విస్పష్టం చేయగోరుతున్నాను. బ్రిటిషువారు పన్నివిస్తున్న సార్వభౌమాధికారాన్ని సంస్థానాధిపతులు చలాయించజాలరు. సార్వభౌమాధికారం ఎప్పుడూ ప్రజలదే అవుతుంది. సంస్థానాధిపతులు తమన్యాయసమ్మతమైన హక్కులను నిలబెట్టుకోడానికి ప్రయత్నిస్తూ పరిపాలనలో అభ్యుదయకరమైన విధానాన్ని అనుసరించాలి."

ప్రజాభీష్టాన్ని పురస్కరించుకొనే డెక్కన్ సంస్థానాలు సమితిగా ఏర్పడినవని చెప్పి, రాజ్యాంగపరిషత్తులో చేరడానికి అవి నిర్ణయించుకున్నందుకు వాటిని అభినందించాడు.

బొంబాయిలో నరేంద్రమండలి కావించిన తీర్మానం అనేక అర్థాలు తీయడానికి వీలుగా వక్రమైన పరభావంలో రచించబడిందని సర్దార్ పటేలు అన్నాడు. "దేశంలో శాంతిభద్రతలను సంరక్షించడం, విశ్వర్యవంతమైన సమైక్య భారతదేశాన్ని సృష్టించడము ఇవే గనక యథార్థంగా సంస్థానాధిపతులు ఆశయాలైనట్లయితే, భవిష్యద్భారతదేశాన్ని గట్టి పునాదులమీద నిర్మించడానికి ఇప్పుడు జరుగుతున్న కృషిలో సంస్థానాధిపతులు కూడా పాల్గొని సహకరించవలసి ఉంటుంది." ఉపన్యాసాన్ని ముగిస్తూ సర్దార్ పటేలు ఇలా అన్నాడు:-"కాంగ్రెస్ సంస్థ నానాటికీ దుర్బలమౌతున్నది. కలకత్తాలో జరిగిన ట్రామ్ పనివారల సమ్మెనుకూడా కాంగ్రెసు సేవకులు నిగ్రహించలేకపోయినారు. బొంబాయిలో కాంగ్రెసు సేవకులే బస్సు ట్రామ్ పనివారల సమ్మె జరిపించారు; స్థానిక కాంగ్రెసు సంఘం సమ్మెను ప్రతిఘటించలేకపోయింది. మహత్తరమైన మన జాతీయసంస్థయొక్క పురోగమనానికి ఈలోటుపాట్లుఅన్నీ తీవ్రమైన ప్రతిబంధకాలుగా పరిణమిస్తున్నవి. సమస్యలను స్నేహపూర్వకంగా పరిష్కరించుకోడానికి అవకాశాలు ఉన్నప్పటికి కాంగ్రెసుయొక్క శక్తిసామర్థ్యా నీవిధంగా అనవసర సంఘర్షణల్లో వ్యర్థపుచ్చడం జరుగుతున్నది. బీహార్లో కాంగ్రెసుప్రభుత్వానికి ప్రతి కూలంగా పోలీసులచేత సమ్మె జరిపించిందికూడా కాంగ్రెసు సేవకులే. ఈ పరిస్థితులు క్రమేణా అరాజకానికి దారితీసి మళ్లీ మనకు దాస్యంఅనుభవించవలసిన గతి పట్టరచ్చును. ఎట్టి పరిస్థితులు సంభవించినా జాన్‌సరికి భారతదేశాన్ని వదిలిపెట్టి పోవడానికి బ్రిటిషువారు నిర్ణయించుకున్నారు కాబట్టి వారు తొలగిపోయిన తరువాత వారిస్థానే మరెవరైనాకూడా రావచ్చును.

బ్రిటన్-అల్బేనియా తగవు

అంతర్జాతీయ న్యాయస్థానానికి పంపాలని సూచన

న్యూయార్కు, ఏప్రిలు 3: గత సంవత్సరము అక్టోబరు మాసంలో అల్బేనియా రాజ్య కోస్తావద్ద కార్ఫ్యూ చానెల్ అను సింధుశాఖలో మందుగనులను నీటియందు మాటుపెట్టియుండిరి. అందుకు ఫలితముగా రెండు బ్రిటిషు డెస్ట్రాయరు యుద్ధనావలకు నష్టము కలిగెను. పరిణామైన హెచ్చరిక ముందుగా చేయకుండా అల్బేనియా ప్రభుత్వం యీ సముద్రప్రాంతంలో మందుగనులను మాటుపెట్టుటవల్ల యీ బ్రిటిషు యుద్ధనావలు నష్టపడినవి. గనుక ఇందుకు అల్బేనియా ప్రభుత్వం క్షమాపణ చెప్పుకొని ఇంగ్లాండుకు తగిన నష్టపరిహారమును యివ్వవలెనని కోరుచు సంయుక్త రాజ్య మహాసభకు విన్నవించెను. సంయుక్తరాజ్య మహాసభయొక్క భద్రతా మండలి యీ తగాదా విషయమై చర్చించెను.

అల్బేనియా కోస్తాకు చేరువగా నున్న సముద్రభాగంలోనికి బ్రిటిషు యుద్ధనావలు ప్రవేశించుట (అక్రమమునియు, హద్దుమీరి ప్రవ

4-4-47 శుక్రవారమునుండి 9-వ వారము

సెలెక్టు, మద్రాసు

శుక్ర, శని, ఆదివారాలలో రోజూ 3 ఆటలు. ఇతరరోజుల్లో 2 ఆటలు.

లాన్సింగ్ సౌండ్‌సిస్టముతో క్రొత్త ప్రొజెక్టర్లు అమర్చబడినవి.

నూర్జహాన్, గీతాబోసు, బేబీ జుబేదా, భూదో, ఘోరీ, అద్వాని నటించిన

ఖల్లి బ్రదర్సువారి

దిల్

సంగీతము, హాస్యములతో నిండిన గొప్ప సాంఘికచిత్రము.

నూర్‌ఫిలిం డిస్ట్రిబ్యూటర్సు (హైదరాబాద్ డక్కన్) రిలీజు

రాబోవు మార్పు

ప్రభాత్ టాకీస్ - బెంగుళూరు సిటి

ప్రభాత్ పౌరాణికచిత్రము

* గోకుల్ *

రచనలోను, సంగీతంలోను నూతనపంథా

కమ్తలాకోట్నీస్, ఆనంత్ ఘర్‌ఠె, సవ్రి మున్నగు

నటీనటులు పాల్గొన్న భలిం

ఇత్తర ముఖ్యకేంద్రములలో యిపుడు దిగ్విజయంగా ప్రదర్శింపబడుతున్నది

బుకింగుకు

ఫేమస్ పిక్చర్సు, బెంగుళూరు సిటీ

Gram : Famousfilm — Phone : 2663.

ప్రకటన

మెసర్సు సిండియా స్టీం నావిగేషన్ కంపెనీ లిమిటెడ్ వారి ఎస్. ఎస్. ఇంగిల్‌స్టన్, విశాఖపట్టణము మండి రంగూనుకు 1947-వ సం॥ ఏప్రిల్ 25-వ తేదీ గాని ఆ ప్రాంతమువగాని బయలుదేరును. అందులో మొదటి తరగతి, రెండవ తరగతి, డెక్ ప్రయాణికులు ప్రయాణించవచ్చును.

ఇండియా ప్రభుత్వమువారి బర్మా ప్రభుత్వము వారి జారీచేసిన ఐడెంటిటీ సర్టిఫికెట్లు గాని, పర్మిట్లు కాని కలిగియుండి, రంగూనుకు వెళ్ళదలచిన ప్రయాణికు లెల్లరు, విశాఖపట్టణములోని ప్రాంటెక్టర్ ఆఫ్ ఎమిగ్రంట్సువారి యెదుట పరీక్షకు హాజరు కావలెను. బర్మా వెళ్ళుటకు వీరు అనుమతించినవారికి మాత్రమే టిక్కెట్లు యివ్వబడును.

ప్రయాణికులు, టీకాల సర్టిఫికెట్లు గూడ కలిగియుండవలెను.

గొప్ప తగ్గింపు

అన్ని డిపార్టుమెంటులలో అప్పుడప్పుడు జరుగు స్కూ్రటినీ మూలంగా ధరలు చాల తగ్గించబడినవి. అనేక అద్భుతమైన సరుకులు యిపుడు తెలియగలవు

1	దిసుమతి చేసిన నలుపు రింగ్ వెల్వెట్ గజము 1-కి	రు.	16-8
2	అందమైనరంగుల్లో హెవీ ప్లెయిన్ క్రేపె ,,	రు.	6-4
3.	ప్రింటెడ్ క్రేపె ,,	రు.	6-4
4.	మల్టి ప్రింటెడ్ క్రేపె ,,	రు.	4-15
5.	బెంగాల్ సిల్కు ప్రింటెడ్ చీరలు ,,	రు.	48-8
6.	ఇంగ్లీషు టూటాల్ మర్టలు - కొద్ది స్టాకు మాత్రమే వున్నది.		

KEWALRAM'S

కేవల్ రామ్సు

వైట్ షాప్

9-18 రత్తకబజారు, — మద్రాసు.

CIBOL సైబాల్

మొటిమలు, అడుసుపుండ్లు, గజ్జికురుపులు, నెత్తురుగడ్డలు, కాలినపుండ్లు, తామర మొదలైనవానికి అమోఘమైన ఔషధం.

ఎల్లచోట్ల లభిస్తుంది

తయారుదారులు

THE SOUTH INDIAN MFG CO., MADURA.

ఏజెంట్లు: రాజన్ డ్రగ్ స్టోర్స్, సైనియప్పశాయర్ వీధి, మద్రాసు 3.

సీతారాము జనరల్ స్టోర్స్, బెజవాడ.

ఎరిజా మెడికల్ స్టోర్స్, కొంగుకూరు సిటీ.

పరిశ్రమల విషయంలో కొత్తమంత్రివర్గ విధానం

పారిశ్రామికమంత్రి సీతారామరెడ్డిగారి వివరణ

చెన్నపురి, ఏప్రిల్ 4: రాష్ట్రపరిశ్రమల విషయమై కొత్త మంత్రివర్గవిధానం ఎలా ఉంటుంది? ఉన్నపరిశ్రమలకు ఎలాంటి ప్రోత్సాహం ఇస్తారు? కొత్తపరిశ్రమలకు ఎలాంటి సహాయం చేస్తారు? మంత్రివర్గానికి నిర్దుష్టమైన కార్యక్రమం ఏమైనా ఉన్నదా? మొదలైన ప్రశ్నలకు పారిశ్రామికమంత్రి శ్రీ హాలహర్వి సీతారామరెడ్డిగారు మా విలేఖరికి సమగ్రమైన సమాధానాలు యిచ్చారు. ప్రశ్నలను, సమాధానములను క్రమంగా ఇచట ప్రచురిస్తున్నాము.

ప్రశ్న: ఆంధ్రదేశంలో ఉన్న పరిశ్రమల సహజసంపద ఏది? వాటిని వృద్ధి చేయుట ఎట్లా?

జ: పేపరుమిల్లులు, సిమెంటు ఫ్యాక్టరీలు, బట్టల మిల్లులు, ఆటవిక సంపదవల్ల వృద్ధిచేయదగిన పరిశ్రమాగారాలు పెట్టడానికి ఎంతో అవకాశం ఉన్నది. ఇంకా ఖనిజసంపదగూడా ఉన్నది. ఇవి ఇంతవరకూ చాలాభాగము దేశానికి వినియోగించుకొనే యత్నాలు జరిగిఉండలేదు. ఆయా జిల్లాల ప్రజలు దేశములోని ఆర్థిక ప్రకృతి సంపదను, పరిస్థితిని గమనించి ఆచరణయోగ్యములైన ప్రణాళికలను తయారుచేసి ముందుకువచ్చి ప్రభుత్వముతో చెప్పినట్లయితే, 'అవశ్యమూ, మూలధనములో కొంత పేరు ఇచ్చుటవల్లగాని, సాంకేతిక సహాయసంపదల ఇచ్చుట ద్వారాగాని, స్థలసేకరణ, విద్యుత్తు మున్నగు ఇతరవిధములైన సౌకర్యముల కూర్చుటలోగాని ప్రభుత్వము ఎంతమాత్రమూ వెనుదీయదు.

ఆంధ్రదేశమునందు గృహపరిశ్రమల అభివృద్ధికి ఎంతయూ అవకాశము ఉన్నది. దానికి హెచ్చు ప్రాధాన్యముగా కపోయినా, ఇతరములయందున్న శ్రద్ధయైననూ చూపి గృహపరిశ్రమల పెంపొందించుటగూడా ఎంతో అవసరమై ఉన్నది. అందులో ముఖ్యముగా మనకు తట్టునది తట్టవలసినది నూలు పరిశ్రమ, నేతపరిశ్రమ. విద్యుత్తు సాధించి వ్యాప్తి చేసినతర్వాత, జపానులో ఈ గృహపరిశ్రమలు ఎంత్ర నేర్పుగా విరివిగాంచినవో గమనించి, జాగ్రత్తగా వృద్ధిచేయుటకు ఒక కార్యప్రణాళికను మార్గములను నిర్ణయించుకొనవలెను. ఆ దేశమునుచూసి మనదేశ పరిస్థితులకు అనువగునటుల మన పరిశ్రమలను పెంపొందించుకొనవచ్చును. ఈ విషయమును నేను చూచాయగా మాత్రమే చెప్పితిని.

పెద్దపరిశ్రమలు: చిన్నపరిశ్రమలు

ప్ర:-పెద్దపరిశ్రమలకు చిన్నపరిశ్రమలకు అనుసంధానమె లెట్లుకూర్చెదరు?

జ:-మన రాష్ట్ర అర్థికవ్యవస్థలో పెద్దపరిశ్రమలకూ, చిన్నపరిశ్రమలకూ గూడా తావున్నది. మన ముఖ్యలక్ష్యము ఏమై ఉండవలెనన్న—పెద్దపరిశ్రమ చిన్నపరిశ్రమకు దెబ్బగారాదు. అది ప్రధాన సిద్ధాంతము రెండవభాగము భారతదేశము ఏకమన్న దృష్టియే మన రాష్ట్ర అవసరము లేవో గుర్తించి నడుచుకొనవలసియున్నది. ఇతర రాష్ట్రములలో సాధించెడిదీ, సాధించునదీ చూచి, దాని పరిణామము గమనించి 'మనముమన' కార్యవిధానమును నిర్ణయించుకొనవలెను ఐక్యభారతవర్షమని మనము కలవరించి, అందుకు పనిచేయుచున్నంతకాలమూ అఖిలభారతదృష్టిలో మనము ఆలోచించి, ప్రణాళికల తీర్చి దిద్దుకొనకలయును. భారతదేశపు ఆర్థికపటమునుండి మనము విడివడిపోతిమనే దృష్టితో మనము ఏపనీ చెయ్యరాదు. అటులని మన రాష్ట్రముయొక్క న్యాయమైన హక్కులను మనము బలియొనర్చరాదు. రాష్ట్రక్షేమమునకూ, అఖిలభారతఐక్యమునకు చక్కనిలంగరు పదిర్చి మన కార్యక్రమమును, ప్రణాళికను ఏర్పరచి పనిచేసుకొనవలయును.

వికేంద్రీకరణ

ప్ర:-జీవులకు ప్రధానమైన ఆహారవస్త్రములకు అవశ్యమూ వికేంద్రీకరణ విధానము ఉండవలెనను దానిపై తమ అభిప్రాయమేమి?

జ:-వికేంద్రీకరణమనేది ఒక నిరాకారమైన పరతత్త్వముకాదు. అది ద్వంద్వ ప్రపంచమునకు బద్ధమైన పరస్పరాశ్రయ విషయము. ఆయాదేశకాల పాత్రములను బట్టి మారుచూ, అన్వయింపబడుచుండును. ఆయాకాలముయొక్క వాస్తవిక విశేషములను, సాధ్యాసాధ్యములను గమనించి, ప్రతిసమస్యను విశదీకరించి పరిష్కరించుకొనవలసి ఉన్నది.

మరకదుళ్ళ మాట

ప్ర:-అయిన ఇప్పుడు కేంద్రప్రభుత్వము సిఫార్సుచేసిన మన రాష్ట్రపు మరకదుళ్ళ మాట ఏమి?

జ:-మాజీ ప్రధాని శ్రీ ప్రకాశం పంతులుగారు శాసనసభలో తెలిపినటుల ఆ సమస్య విషయమున కాంగ్రెసుపార్టీ ఇంకనూ ఒక నిర్ణయమునకు వచ్చియుండలేదు. మేము అధికారములోనికివచ్చి ఎన్నోరోజులు కాలేదు. ఇన్నాళ్లూ గూడా కష్టతరమైన శాసనసభా కార్యక్రమమునందే నిమగ్నమైయుంటిమి. ఇది వివాదాస్పదమైన విషయము. ఈ విధానమునకు ఏవిధముగానూ, ప్రత్యేక ఆసక్తిలేని వారు సైతము చాలా ప్రతిఘటన చూపిరన్నమాట నిస్సంశయము.

పరిశ్రమలు ప్రభుత్వ అధీనము

ప్ర:-పరిశ్రమలను ప్రభుత్వాయత్తము చేయు విషయమున తమ ఉద్దేశ్యమేమి? ముఖ్యముగా హోటారు రవాణా, పేపరు, సిమెంటుల విషయమున మీ అభిప్రాయమేమి?

జ:-పరిశ్రమలు ప్రభుత్వ ఆధీనమగుట వాస్తవమునకు మంచిదే. ఎందువల్లనన—ప్రభుత్వకోశాగారమునకు అవి హెచ్చు ప్రయోజనము తెచ్చునుగనుక. అయితే ఇంగ్లండులోగూడా ఉక్కులాంటి పరిశ్రమలు ఇంకనూ ప్రభుత్వాధీనమై ఉండని మాట గమనార్హము. అక్కడ సామ్యవాద చింత గలిగిన మనుష్యులు అధికారమందున్ననూ అది సాధ్యముఅవలేదు.

బొగ్గుపరిశ్రమను ప్రభుత్వము తీసుకొనవలెనను సందర్భమున బోలెడంత పరిశోధనా ప్రవీణుల ఆలోచనలు జరిగినవి. ప్రజలకు విమర్శించుటకు అవకాశమివ్వబడినది. ఉపయుక్తమైన సూచనలు చేయబడి అంతహంగామా జరిగాక ఆ పరిశ్రమ ప్రభుత్వాధీనమగుట జరిగినది. అదేవిధముగా మనము ప్రతిపరిశ్రమయొక్క బాగోగులు, పరిస్థితులు ఆప్రభుత్వాధీనము చేయుటకుముందు ఆలోచించక తప్పదు. ప్రభుత్వాధీనమే దూరలక్ష్యముగా వచ్చునుగాని అంతమాత్రమున కొత్త పరిశ్రమలు ప్రారంభించగోరు ప్రజ్ఞాధురీణులకు నిరుత్సాహము పొందవలసిన కారణములేదు. ప్రభుత్వము ఎప్పుడైనా ఈ పరిశ్రమను కైవసము చేసుకొనుననే భయముతో వారెవరూ పారిపోవలదని నా మనవి. మన రాష్ట్రమందలి పారిశ్రామికవరులు, పరిశ్రమాభ్యుదయ కారకులు చక్కని స్కీములు ఆచరణయోగ్యములైన ప్రణాళికలువేసి చూపవచేసి, ముందుకు వచ్చిన ప్రభుత్వము తప్పక సహాయము చేసితీరును.

ఇంతవరకూ పరిశ్రమలలో మనము వెనుకపడియుంటిమి. వాస్తవిక పరిజ్ఞానముతో ఈ ప్రభుత్వాధీనమను విషయమును ప్రభుత్వము పరిశీలించగలదని నేను వాగ్దానము చేయుచున్నాను. సమర్థమూ, నిర్వాహకమూ అయిన పద్ధతిలో, ("నేమనలై శేషమను") పరిశ్రమలు ప్రభుత్వాయత్తమగుటకు కొంతకాలము సహజముగా పట్టునని నేను గట్టిగా నచ్చచెప్పదలచినాను. ఇక హోటారులు ప్రభుత్వము నడుపునవిషయమై ప్రభుత్వకోశాగారమును నింపుటకు ఇదొక మంచి మార్గమన్నమాట నిస్సందేహమే దీనిని బాగావిస్తరింపచేయదగును. చేయవచ్చును. కేంద్రప్రభుత్వంవారు రైళ్లను నిర్వహించుచున్నపుడు రాష్ట్రప్రభుత్వమువారు బస్సులను నిర్వహించుటలో నా కెట్టి ఆటంకమును కనిపించుటలేదు.

ఇక పేపరు, సిమెంటు పరిశ్రమలెంటనే ప్రభుత్వాయత్తముచేయుట సాధ్యముగాదు. ఎందువల్లనన ఉన్న ఫ్యాక్టరీలను వెంటనే ప్రభుత్వము కొనివేయవలసి ఉండును. ఆర్థికముగ పెద్దలావాదేపీలు ఇందు ఇమిడిఉన్నవి. పేపరుమిల్లు ప్రస్తుతము రాష్ట్రమున ఒక్కటే ఉండవచ్చును. అడవులు హెచ్చుగానున్న ప్రదేశమున పేపరుమిల్లుల స్థాపించి ఇప్పటి సంఖ్యను పెంచవచ్చును. ఈ పరిశ్రమకు ప్రభుత్వము అన్ని విధములైన సహాయము చెయ్యగలదు.

ప్ర: ఇట్టి ప్రధానవిషయములం దన్నిటియందు మీకు సలహాఇచ్చుటకు ప్రజలలో నిండిఉన్న ఒక ప్లానింగుబోర్డు అవసరముగదా?

జ:-అవశ్యమూ.—

ప్ర:-పరిశ్రమలన్నిటికి మీరు పెడుతూన్న ఇండస్ట్రియల్ పైనాన్సలు కార్పొరేషను వ్యవహారమేమి?

జ:-ఈ విషయమును కేంద్రప్రభుత్వము దీక్షముగా ఆలోచించుచున్నది. పరిశ్రమలు వృద్ధిపొందవలెనన్న ఇట్టి సంస్థఎంతయూ అగత్యము. అందుకే మద్రాసుప్రభుత్వము ఇట్టి సంస్థ నొకదానిని ఏర్పరచుటకు బడ్జెటులోనిధీ నేర్పాటుచేసినది.

ప్రజలకు అవసరమగు వస్త్రాలు

ప్ర:-ఈ రోజుల్లో మామూలుప్రజలకు మధ్యతరగతి పేదలకు అవసరమగు చీరలూ, వస్త్రాలాబదులు, ఎంతసేపూ వాయిల్సూ, కోటుగుడ్డలూ తప్ప లభించుట లేదు? దీనిని నివారించుటకు మార్గాంతరము లేదా?

జ:-నిజమే. ఈ విషయమున ప్రభుత్వము తప్పక చర్యతీసుకుంటుంది. ఈరాష్ట్రమునకు ఏర్పరిచిన కోటామకొను అధికారము వాణిజ్యవరుల హస్తములందున్నది. లాభం గిట్టుబాటుఅయ్యేది, గజాలమబట్టె గాక, బట్ట ఖరీదుమబట్టె అయిఉండుట వల్ల ఈ చిక్కువచ్చి ఉండవచ్చు. ముతక బట్ట జవానికి చాలా అవసరమే. ఈ విషయమై తక్షణమే నేనెట్టి నిర్ణయమూ చెయ్యగలనని చెప్పలేను. ఈ విషయమున ప్రభుత్వమునకు టెక్నికల్ అడ్వయిజరు అయినటువంటి రాష్ట్రచెక్స్టైల్ కమిషనర్ను ఆలోచించి హెచ్చు ప్రజలకు సహాయకరమగు ఒకనిర్ణయమునుఅవశ్యమూ చెయ్యగలను.

శాసనసభలో భాషలు

మదరాసు అసెంబ్లీలో సభ్యులు ఏభాషలలో ప్రసంగింతురో తెలుసుకొనుటకు స్పీకరు వ్రాసిన లేఖలకు ప్రత్యుత్తరములందు యీ దిగువరీతి తెలిసెను:—

సభా మొత్తం సభ్యులు 215 అందు 66 గురు ఇంగ్లీషులో మాట్లాడెదమనిరి. 48 గురు ఆరవంలో 23 గురు తెలుగులో మాత్రం మాట్లాడెదమనిరి. 19 గురు ఇంగ్లీషులో మాట్లాడగలరు గాని కష్టంగా నున్నపుడు ఆరవంలో మాట్లాడగోరిరి. 21 మంది తెలుగువారు ఇంగ్లీషులో మాట్లాడలేనపుడు తెలుగున ప్రసంగింతుమనిరి.

9 గురు ఇంగ్లీషు కష్టమయినపుడు ఉర్దూలో మాట్లాడెదమనిరి. ఒక్కసభ్యుడు తెలుగునగాని హిందూస్తానీ లో గాని ప్రసంగింతుననెను. ఒక్కరు మళయాళంలోను, 5 గురు మళయాళం ఇంగ్లీషు కూడా ఉపయోగింతుమనిరి.

8 గురు కన్నడం లేక ఇంగ్లీషు, ఒకరు కన్నడంమాత్రం వాడెదమనిరి.

న్యాయశాఖవిభజన నిలిపివేయుట

న్యాయపరిపాలన న్యాయనిర్వహణ శాఖల విభజన ప్రస్తుతం క్రొత్తమంత్రివర్గంగారు నిలిపివేసినట్లు తెలియుచున్నది. ఇందుకొరకై ప్రత్యేకోద్యోగిగ నియమింపబడిన పి. వి. బాలకృష్ణయ్యగారిని తిరిగి ద. ఆర్కాటుజిల్లాజడ్జిగ పంపిరి.

నరముల బలహీనతకు కారణం తొలగింపబడెను

హెచ్చుశ్రమ, మెదడు పనిచేయుట నరముల బలహీనత యేర్పడును. అటువంటిది కలుగకుండ బింకోల తీసికొండి. ఇది నరములకు శమనము కలిగించును. పొరలను నిర్మించును. బలమును చేకూర్చును. దీనిని ప్రతిపోట డాక్టర్లు ఆమోదించివున్నారు.

VINCOLA.

కొండరు

నెల్లూరు మునిసిపాలిటీ, నెల్లూరు

టౌనులో 1947-48 సంవత్సరము నందు యేడు రోడ్డు మెయింటెనెన్సు పనులకు, 1½", ¾", ½" సైజులలో పగులకొట్టిన వల్లరాతి ముక్కలు, సర్ఫేసింగుకు, సీల్ కోటింగుకు, సప్లయి చేయుటకుగాను, 10-4-47 తేది సాయంత్రం 3 గంటలవరకు సీలుచేసిన టెండర్లు కోరబడుచున్నవి. సప్లయిల యొస్టిమేటు ఖరీదు రు 500 ల నుండి రు 2,000 ల వరకు వుండును. అన్ని పనులకు కావలసిన మెటీరియల్ ఖరీదు మొత్తము యొస్టిమేటు రు 7,000 ల. రు 2/-లు చెల్లించి, టెండరు నోటీసు, స్పెసిఫికేషను, కంట్రాక్టు మరఱుం మొదలైనవి కమీషనరుగారినుండి బడయవచ్చును.

కమీషనరు,

నెల్లూరు మునిసిపాలిటీ.

ఉత్తమమైన రకము! చౌకధర!

నిప్పుపెట్టెలు

మంచిరకమునుతో "స్టాండర్డు" మరియు "కా" బ్రాండు నిప్పుపెట్టెలు చౌకరేట్లలో దొరకును. కొలది ఏజెన్సీలు మాత్రమే ఖాళీగా వున్నవి. వివరములకు

STANDARD MATCH INDUSTRIES LTD., MYSORE.

ప్రధానాంధ్రకేంద్రములలో అద్వితీయముగా నడచుచున్న తెలుగుచిత్రము!

7-వ వారము

బెజవాడ — మారుతి	విజయనగరం — పూర్ణా
రాజమండ్రి — మినర్వా	గుంటూరు — రాధాకృష్ణ
కాకినాడ — మినర్వా	
6-వ వారం	
ఏలూరు — కేసరి	భీమవరం — మారుతి
బందరు — బృందావన్	
5-వ వారం	3-వ వారం
పెద్దాపురం — సోమరాజు	విశాఖపట్టణం - పూర్ణా
2-వ వారం	
అనంతపురం - ఎక్సెల్సియర్	

(చమ్రియా రిలీస్)



BOERICKE & TAFEL'S

(America)

హోమియోపతిక్, బయోకెమిక్ ఔషధములు - పుస్తకములకు

డైరెక్టు యింపోర్టర్లు.

రామకృష్ణ హోమియో స్టోర్సు, బెజవాడ.

బాధలను తొలగించును



సారిడాన్

అన్ని నొప్పులను నివారించును



అమ్మకము

"క్రొత్త ఖాకి నిక్కర్లు టోకుగా అమ్మబడును. వివరములకు : ప్రభాత్ కంపెనీ, తాడిపత్రి."

ప్రకటన

కాకినాడ ప్రిన్సిపాల్ సబార్డినేటు జడ్జి కోర్టులో
O. P. 34/1947.

పిటీషనర్లు ముత్తా సర్వారాయుడు వగైరాలు మైనర్లు అయినందున సంరక్షకులు రాలు తల్లి మహాలక్ష్మమ్మగారు వగైరా సాకిన్ కాకినాడ.

రెస్పాండెంటు: ముత్తా సుబ్బరాజు — సాకిన్ పెద్దాపురం.

సదరు నెంబరులో పిటీషనర్లు లేటు ముత్తా వెంకటేశ్వర్లుగారి తాలూకు యిన్సూరెన్సు పోలసీలు, కంపెనీ షేర్లు గవర్నమెంటు పత్రములు వగైరా బాపతులకు Succession Certificate యిప్పించుమని కోరుచూ, పిటీషనర్లు పిటీషను దాఖలు చేసి యున్నారు. గనుక అందు విషయమై ఎవరికైనా ఆక్షేపణలున్న యెడల పైకోర్టులో కోర్టువారి యెదుట 12-4-1947 తేదీని పగలు 11 గంటలకు స్వయముగా గాని, వకీలు ద్వారా గాని హాజరయి తెలియచేయవలెను. లేనియెడల సదరు విషయమై మీ పక్షోత్తుమందు విచారించి తీర్మానము చేయబడును.

బాదం రామచంద్రమూర్తి,
పిటీషనర్ల అడ్వొకేటు, కాకినాడ.

ప్రకటన

ఓరియంటల్ గవర్నమెంటు సెక్యూరిటీ లైఫ్ అష్యూరెన్సు కంపెనీ, లిమిటెడ్.

వుండవిల్లి గోపాల కృష్ణారావు, రాజమండ్రి వారిపట్టా. నెం. 487877 పోయినట్లు నోటీసు యివ్వడమయినది. ఈ నోటీసు తేదికి ఒక నెలలోగా ఆక్షేపణ తెలియపర్చనిచో డుప్లికేటు పాలసీ జారీ చేయబడును.

(సం) యల్. యస్. వైద్యనాథన్,
మేనేజరు, బొంబాయి 1-4-47.

నోటీసు

కసగిరి డిస్ట్రిక్టు మునసబు కోర్టులో
S. C. 533/44. E P 310/46.

ట్రాన్సఫర్ డిక్రీ హోల్డరు:
కొనిపేటి తిరుపతిస్వామి.

ప్రతివాదులు (1) కన్నెమ్మ, (2) వాసుదేవ నాయకగు, (3) మునియప్పనాయకగు యలమంచేలి సైదాపేట తాలూకా.

ప్రతివాదులకు తెలియచేయునదేమనగా:—

మీపైన బాగ్గవరపు వెంకట సుబ్బయ్య పొందియున్న పై డిక్రీని పైవారికి ట్రాన్సఫరు చేసి యున్నాడు. అమలుకు మీకు ఆక్షేపణలు వున్న యెడల 25-4-1947 తేదిన కోర్టులో తెలుపుకొనవలెను.

చీమకుర్తి వెంకటసుబ్బయ్య గుప్త,
ట్రాన్సఫరు డిక్రీ హోల్డరు తరఫు అడ్వొకేటు.

మద్రాస్ కౌన్సిల్

హరిజన దేవాలయ ప్రవేశ బిల్లు ఆమోదము

చెన్నపురి, ఏప్రిల్ 4: నిన్న మద్రాసు కౌన్సిల్‌లో డాక్టర్ రాజన్ గారు పళ్లికాలం పూర్తికాగానే హరిజనుల దేవాలయ ప్రవేశ బిల్లును ప్రతిపాదించిరి.

డి॥ రాజనుగారు దేవాలయ ప్రవేశ చట్టం అసెంబ్లీలో ఆమోదించబడిన ప్రకారము సభవారు ఆమోదించమని ప్రతిపాదించగానే, ఇబ్రహీంగారు కార్యక్రమంలో చట్టం ప్రధాని ప్రతిపాదించునని యుండెకదా డా॥రాజనుగారెందుకు ప్రతిపాదిస్తున్నారని ప్రశ్నించిరి.

డా॥ రాజనుగారు, మంత్రులలో సేవకైనా యింకొకరిపని చేయవచ్చుననిరి. ఉప్పీ సాహేబుగారు, సభవారితో ముందుగా యీమార్పుగూర్చి తెలిపి అనుమతిపొంది తాము ప్రతిపాదించుట మర్యాద యనిరి.

గౌ॥ మాధవమీననుగారు అట్టి నిబంధనగాని మర్యాదగాని లేదనియు, మంత్రులాకరి తరఫున యింకొకరు మాటలాడవచ్చుననియు చెప్పిరి.

అధ్యక్షులు:—అసెంబ్లీలోకూడ రాజనుగారే యీ చట్టమును ప్రతిపాదించిరి. అచట సభ్యులు కాకపోయినా ఈసభలో వారు సభ్యులగుట మరో విశేషము. అయినా కార్యక్రమంలో తమపేరే వ్రాయించి యుండిన యీ ఆక్షేపణ యుండేది కాదు.

డా॥ రాజనుగారు:—నేను ముందుగా యీమార్పు సభవారికి తెలిపియే ప్రసంగించవలసింది. నిజమేనని తెలిపి, దేవాలయ ప్రవేశచట్టంయొక్క అవసరంగూర్చి వివరంగా తెలిపిరి. గాంధిమహాత్ముడు హరిజనులకొరకు ఉపవాసం చేయుట, మూలవ్యాగారు చట్టములు గావించుట, తరువాత మలబారులో దేవాలయప్రవేశ చట్టం మున్నగు వివరాలన్ని తెలుపసాగిరి.

అధ్యక్షులు: మీరు యిదివరకుచేసిన తప్పుకు ప్రాయశ్చిత్తంగా యీచట్టం చేస్తున్నానని, అసెంబ్లీలో చెప్పినట్లున్నారు?

డా॥ రాజను: అక్కడ చెప్పినదంతా యిక్కడ చెప్పమంటారా?

అధ్యక్షులు: కాదు. తమాషాకన్నాను. ఆరూపే ముందుచెపితే మీరేల ప్రతిపాదించేరన్న ఆక్షేపణ యుండదని నాభావం-(నవ్వు).

డా॥ రాజనుగారు, యింకను ప్రసంగించుచు, యిదివరకు రాజగోపాలాచారిగారి ప్రభుత్వంలో గావించిన చట్టానికి దీనికి వ్యత్యాసం తెలిపి, దేవాలయప్రవేశం హరిజనులకు నిరాకరిస్తే శిక్షావకాశాలు యిందులో నున్నాయనిరి. గత కొద్దిమాసాలలో చాల పెద్దదేవాలయాలు, భారతీయులందరిని ఆకర్షించేవి హరిజనులకు తెరువబడినవి. అందుచే గ్రామాలలో యింకా కొన్ని చిన్నదేవాలయాలు తెరువబడకున్నను చింతలేదు. ప్రాతచట్టంలో వలె యిపుడు ప్రజాభిప్రాయం ముందుగ రిఫరెండం ద్వారా తెలుసుకొని దేవాలయాలు తెరువవక్కరలేదు. ప్రజాభిప్రాయం బాగా వెల్లడయింది. కనుక, ప్రజాప్రతినిధి ప్రభుత్వం పబ్లికు దేవాలయాలన్ని హరిజనులకు విధిగా తెరువాలని వెంటనే యీ శాసనం చేస్తున్నది. దేవాలయాలకు వెళ్లమని బలవంతం చేయలేదు. వెళ్లని హిందువులెందరో ఉన్నారు. కాని వెళ్లదలచిన హిందూ తెగలన్నింటికి ప్రవేశం వుండాలనే యీచట్టం శాసించుచున్నది. అస్పృశ్యతా నివారణకు యీచట్టం ముఖ్యసాధనం దేవాలయాలలోనికే పోలేనన్న హరిజనులను అగ్రజాతులు యికముందు యిండ్లలోనికి వీధులలోనికి రానివ్వకుండ వారింపలేరు.

దేవాలయాలను హరిజనులకు తెరచేగుకదా యని, యీ చట్టాధికారము ననుసరించి ఆవేళస్వదుకూడ తెరువమని కోరకుండుటకై, కొన్నిక్రమపద్ధతులు ఆచారాలు కావాడుటకై ట్రస్టీలకు కొన్ని అధికారములిచ్చు క్లాజులు యిందుగలవు. ఈ చట్టం తలపెట్టిన గత 8 నెలలలో ఒకే ఒక గాయబారవర్గం కొద్దిమంది సనాతనులతో గూడినది వచ్చి కొన్నిముఖ్యమయిన దేవాలయాలను సనాతనులకు విడచిపెట్టాలని, వాటిని యీచట్టంనుండి మినహాయించాలని కోరిరి. పబ్లికు దేవాలయాలు అలా మినహాయించుటకు వీలులేదని, వారికి కారలసినచో ప్రయివేటు దేవాలయాలను వేరే నిర్మించుకోవచ్చని ప్రభుత్వంవారు చెప్పియుండిరి. ఈ చట్టం హిందూమతానికి చాల ముఖ్యమయింది కనుక, అన్నిజాతుల సభ్యులు దీన్ని ఆమోదించి తోడ్పడాలని కోరిరి.

హెచ్. ఎం జగన్నాథంగారు (హరిజను) మంత్రిగారిని అభినందించ జాలమనిరి. ఇదివరకు చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తంగా యీ చట్టం చేసియుంటే పంతిసించియుందుము. కాంగ్రెసుపార్టీ వారు రాజకీయ యెత్తుగాదీన్నిపుడు ప్రవేశపెట్టుచున్నారు

దేవాలయాల్లో ప్రవేశించే విషయమై గల ప్రతిబంధకాన్ని యీబిల్లు మూలాన తొలగించినంత మాత్రాన హరిజనోద్ధరణ కార్యం పూర్తి కాగలదని ఎంచకూడదనియు, హరిజనులకు వలయు జీవితావసరము లను సమకూర్చినే తప్ప యీసంస్కరణలవల్ల ప్రయోజనం కలుగదనియు, జాతివిభేదాలు ముఖ్యంగా అంతరించాలనియు విన్నవించిరి. డా॥ వి. కే. జాన్ గారు ఆలయ ప్రవేశబిల్లును బలపరుస్తూ మంత్రివర్గంవారి బిల్లును ప్రవేశపెట్టినందుకు వారిని తాను అభినందిస్తున్నట్లు పలికిరి. హరిజనుల దేవాలయంలో ప్రవేశించేందుకు హక్కునివ్వడం బాగానే ఉన్నప్పటికి హరిజనులకి అభివృద్ధిపరచకపోతే యీ శాసనంవల్ల వారికి మేలు కలుగదన్నారు.

డాక్టరు తాజుద్దీన్‌గారు ప్రసంగిస్తూ, యీ బిల్లు యిదివరకే శాసనం అయియుండవలసినదనియు కొంత ఆలస్యమైనా యీ బిల్లును ప్రభుత్వంవారు ప్రవేశపెట్టినందుకు వారిని అభినందించవలెననియు చెప్పిరి. కారదాచట్టంవలె యీ శాసనం నిరుపయోగం కాకుండా నుండునట్లు చూడవలెనని వారు చెప్పిరి. వర్ణభేదాలు మూలమున నే సీమీందూ సంఘంలో కష్టాలు ఏర్పడుచున్నవనియు యీ వర్ణభేదాలు అంతరింపచేయుటకు కాంగ్రెస్ పూనుకుంటే హిందూ సంఘం బాగా బలపడగలదనిరి.

శ్రీ కే వెంకటస్వామి నాయుడుగారు మాట్లాడుతూ హిందూ సంఘం బలపడేందుకు అవకాశంగల యిట్టి హరిజన ఆలయ ప్రవేశబిల్లును ప్రభుత్వంవారు శాసనం చేయడం పరమపవిత్రమైనచర్యగాభావించి గర్విస్తున్నానన్నారు. ఇట్టి సంస్కరణకు మహాత్మాగాంధియే ముఖ్యకారకుడనియు ఆయన యిటీవల తననివాసమును భంగీల కాలనీలలో నే ఏర్పరచుకొంటూ హరిజనులకు సవర్ణులకు యుండే విభేదాలను నశింపచేయుటకు ప్రయత్నిస్తున్నాడు. ఆయన ప్రయత్నాలవల్ల హిందూ సంఘాలలోగల వర్ణవిభేదాలు త్వరలోనే పోయి ధనికులు సామాన్యులనే రెండు తెగలే దేశంలో నిలుచునని తాను అనుకొను చున్నట్లు అన్నారు.

మహ్మద్ ఇబ్రాహీముగారు ఉపన్యసిస్తూ ప్రజాసమత్వము సాధించుటకొరకు యీ బిల్లు ఉద్దేశింపబడి యున్నందున ముస్లింసభ్యులైన తాము బిల్లును బలపరుస్తున్నామని అన్నారు. అటుపైన సభవారు ఫలాహారానికి లేచిరి.

మధ్యాహ్నం 2-30 గం॥కు తిరిగి కొన్ని లుసమా వేళమైనప్పుడు కోరంలేకపోయింది. కొంతసేపు గంటమ్రోగుటతో సభ్యులు లోనికి రావడం జరిగినమీదట ఆలయ ప్రవేశపుబిల్లు చర్చ ప్రారంభమైంది.

శ్రీమతి మోనా హెన్సమన్ సతిగారు బిల్లును బలపరుస్తూ యితర ఉన్నత కులాల వారికి గల హక్కులను సమానముగా హరిజనులకు కూడా కల్పించుటకు యీ బిల్లు ఉద్దేశిస్తున్నది కావున దానిని అందరూ ఆమోదించవలసినదే నన్నారు.

శ్రీ ఆర్. సూర్యనారాయణరావుగారు బిల్లులోని కొన్ని అంశాలను గూర్చి మాట్లాడుతూ ఏదైనా ప్రార్థనస్థలం దేవాలయమా కాదా అనే వివాదం ఏర్పడితే యీ ప్రశ్నను పరిష్కరించే అధికారం ప్రభుత్వానికి కలదని చెప్పడంతో ఊరకుండక సివిల్ కోర్టులలో వ్యవహారాలకు కూడా ఆస్పదము బిల్లులో యివ్వడం మంచిది కాదనియు అట్టి ఆస్పదం బిల్లు సదుద్దేశాన్ని వమ్ముచేయునని చెప్పిరి.

శ్రీమాదే నారాయణరావుగారు హిందూసంఘం అస్పృశ్యులనే వారిని యిన్నాళ్ళు అణగద్రొక్కి పైకిరాకుండా చేసిన పాపం యీశాసనంవల్ల హరించిపోవునని తలుస్తాను. కాంగ్రెస్ వారు రాజకీయముగా ప్రాబల్యంబడయుటకు అస్పృశ్యతా నివారణకు పూనుకొనడం ఒక ఎత్తుగా శ్రీ జగన్నాథంగారు చెప్పిరి. అది ఎన్నటికి నీచంకాదు. మహాత్మాగాంధీగారు పరిశుద్ధమనస్సుతోనే యీపనికి పూనుకొనియున్నారనే విషయం అందరికి విదితమే యనిరి. హరిజనులను పైకి తీసుకురావాలంటే ముఖ్యంగా వారిని విద్యావంతులుగా చేసి వారలస్థితిని బాగుపరచడమే కావలెను. హిందూసంఘంలో ఉన్నత జాతివారు తమ భావాలను మార్చుకొని యింతవరకు హరిజనులపు చేసిన అన్యాయాన్ని గుర్తించి యిపుడైనా యీశాసనమును తిప్పక ఆమోదిస్తారని తాను విశ్వస్తున్నట్లు చెప్పిరి. దేవాలయం ధర్మకర్తలు అనేక ఖండాలాలు చేసేవారు దేవాలయాలలోనుండి పవిత్రంగానున్న హరిజనులను రానివ్వడంలేదు. అలాంటి తి తొలగించాలి. హరిజనకుటుంబాలలోనుండి బాలురను ప్రభుత్వంవారే చదివించి వారి ఆర్థికవిద్యాభివృద్ధి చేయాలి. అగ్రజాతులవారంతా యీ చట్టాన్ని ఎట్టి పవిత్రభావంతో యీ సభవారు చేశారో గమనించి, అమలుజరపాలని కోరుచున్నానన్నారు.

మంత్రి మాధవమీననుగారు మలబారులో ఒక్క దేవాలయం తప్ప తక్కినవన్ని హరిజనులకు తెరువబడలేదనియు జమీందారుల చేతిలో దేవాలయాలుండబట్టి వారిని ఒప్పించుట కష్టమనియు, అందుచే చట్టం చేయుట అవసరమనియు చెప్పిరి. మలబారు ఆలయప్రవేశచట్టం 10 సం॥ముల క్రిందట అమలుజరిగినా ప్రయోజనం లేకపోయింది. అచట హరిజనులకే గాక, బ్రాహ్మణులకు గూడ కొన్నింట ప్రవేశం లేదనియు, మాలవ్యాగారిని గురువయ్యారు దేవాలయంలోనికి రానీయలేదనియు, ప్రతి సంఘానికి యింకో సంఘంవారికి ఎంత దూరంలోనుండాలో నిర్ణయించబడియుండనియు, అటువంటిచోట యిలాంటి చట్టాలుంటే యీ దురాచారం పోవుటకు అవసరమనియు చెప్పిరి.

అధ్యక్షులు:—చట్టంలో పేర్కొన్న "ఎక్సక్లూడెడు తరగతులు" అన్నపదం బ్రాహ్మణులకు గూడ వర్తించునను కొందురా?

మంత్రి:—ఇపుడు దూరాన ఉంచబడినవారందరిలో వారు నున్నారు కనుక వర్తించును. జగన్నాథంగారు హరిజనులగ చాల బాధపడియున్నారు. గనుక చాల కష్టంతో మాట్లాడి అగ్రజాతుల గూర్చి అట్లు పలుకుట సహజమే. కాని మేము చెపుతున్నమాటలు హృదయపూర్వకంగా చెపుతున్నామని నమ్మి యిది కేవలం రాజకీయ యెత్తుగాదనెంచరాదని కోరుచున్నాను. అనిచెప్పి చట్టాన్ని బలపరచిరి.

డా॥ రాజనుగారు చర్చకు బదులు చెప్పినమీదట సభవారు బిల్లును ఆమోదించారు. బిల్లు శాసనమైంది. తరువాత సుబ్బరాయన్‌గారు అధ్యక్షునివేతనానికి, అనర్హతల తొలగింపుకు సంబంధించినబిల్లులను ప్రతిపాదించారు. అధ్యక్షుని వేతనాలబిల్లు క్లాజువారీగా చర్చ జరిగి ఆమోదింపబడిన తరువాత సభను ఏప్రిల్ 21 వ తేదీ 3 గంటలకు వాయిదా వేశారు.

ప్రచురణశాఖ పని

మదరాసు ప్రచురణశాఖయం దిద్దరుద్యోగులు నియమింపబడిరి, వారు చేస్తున్న పనేమియని ఆర్. సూర్యనారాయణగారు, అనేక ప్రశ్నలు వేయగా ప్రచురణశాఖ మంత్రి హ. నీతారామరెడ్డిగారు యీ దిగువరీతి బదులు చెప్పిరి:

ప్రచురణశాఖ యందున్న పుస్తకపత్రికలు ఇంగ్లీషులో 2750, తెలుగు 1000, తమిళం 1500, మళయాళం 500, కన్నడం 500, హిందీ 1000 ప్రచురించుచున్నారు. హిందీ ప్రచురణయందు దేవనాగరి లిపిలో కొన్ని ఉర్దులిపిలో కొన్ని వేస్తున్నారు. హిందీభాగము ఉత్తర హిందూస్థానం ప్రజలకు మదరాసు మంత్రివర్గంవారి చర్యలు దక్షిణదేశ విజ్ఞానాధిక్యత తెల్పుటకు ఉద్దేశింపబడింది. ఇవిగాక ప్రభుత్వ ఆహార, కార్మిక యిత్యాది శాఖలన్నింటికి సంబంధించిన కరపత్రాలు ప్రచురించిరి. జమీందారీపద్ధతి గూర్చి దాన్ని ప్రభుత్వం వారెట్లు మార్చదలచిరో కరపత్రం ఒకటి తయారగుచున్నది.

డిస్ట్రి, సబు పబ్లిసిటీ ఆఫీసర్లు, జిల్లా అసిస్టెంటులు మున్నగు సిబ్బందిని నియమించుటకు స్కీము మంజూరయినవి. జిల్లాలలో ప్రభుత్వ ప్రతికూల ప్రచారం గూర్చిన వివరాలు తెలుసుకొని దాన్ని ఖండించుటకు జిల్లాల సిబ్బంది పనిచేయనుద్దేశింపబడింది. వీరిక్రింద ఫీల్డు పబ్లిసిటీ సిబ్బంది యుండును. పత్రికలు ప్రచురించుటకు రూ 1.1 లక్షలు సాలీనా ఖర్చు.

ఉప ప్రశ్నలకు బదులుచెబుతూ, జిల్లా నియామకాలు ప్రస్తుతానికి నిలిపియుంచబడినవనియు, అవసరం కల్గినపుడు అమలు జరుపబడునని యు మంత్రిగారు బదులు చెప్పిరి. వృథాగా వ్యయంకాకుండా శ్రద్ధ వహించుమని. ఉత్తర హిందూస్థానంలో ఎక్కువమంది ఉర్దులిపి అర్థమయ్యేవారని ఇబ్రహీంగారన్నమాట వంగీకరింపజాలనని, ఇతర రాష్ట్రాలవారు యిట్టిప్రచారం చేసి వారే యక్కడ పనిమంచి పని అని తోచిందో, యీ రాష్ట్ర ప్రభుత్వం అమలు జరుపుననియు చెప్పిరి.

ప్రభుత్వ సమాచారు పత్రికలు పంపకుండా ఆఫీసులోనే మిగిలి పోతున్నాయి కాదాయని ఘూర్కీగా రడుగ, అట్టివి జరుగకు పంచుటకే అన్పు వేస్తున్నామనిరి. హిందీ యీ రాష్ట్రంలో స్థానీయ భాష కాకున్న ఉత్తరాదికోసం హిందీ ప్రచురణ వేస్తున్నామని సూర్యనారాయణగారికి బదులు చెప్పిరి.

కావలెను

మా ప్రొడక్టులకు (నావెల్టీలు, ఆటబొమ్మలు వగైరా) ఆర్డర్లు సంపాదించటానికి స్త్రీపురుషులు కావలెను. పెట్టుబడి గాని, నష్టము గాని లేకుండా నెలకు రు 500/-లు సులభముగా సంపాదించవచ్చును. మా మరతులకు కాంపిల్సుకు వ్రాయండి. జాబులు యింగ్లీషులోనే వ్రాయాలి.

Jai Hind Sales Corporation
HARSAULI, ALWAR.

బెనిఫిట్ ఎగ్జిబిషన్

తేనాంపేట, కాంగ్రెస్ గ్రౌండ్సు.

రోజూ మ॥ 2 నుండి రా॥ 9 గంటల వరకు.

15-4-1947 వరకు.

సంగీతకచేరి

5-4-47 తేది శనివారము సా॥ 6 గంటలకు

ఫిలిం ఖ్యాతిగాంచిన

కే. తవమణిదేవి

ప్రాక్టిస్ మేనాట్యము.

రేట్లు రు. 8, 2, 1,

రిజర్వేషను అ. 8 అధికం.

బుకింగు తెరవబడినది.

6-4-47 తేది ఆదివారము సా॥ 6 గంటలకు

కే. బి. సుందరమ్మాళ్ - గాత్రం.

యెగ్జిబిషన్ స్పెషల్ బస్సులు నడుస్తున్నవి.

లౌడ్ స్పీకర్ యేర్పాట్లు గ్రీకేడియోవారివి.

అమ్మకము

దిగువ తెల్పబడిన సామాన్లుగల రెండుషెడ్లు అమ్మకమునకు సిద్ధముగా నున్నవి.

వివరములు:-ఒకొక్క షెడ్డులో - 6 అడుగులనుంచి 9 అడుగులపొడవుగల ఇనుప కళాయి డోరియారేకులు రమారమి 800. 20 అడుగుల పొడవుగల పట్టాలు, 36 3×3 అంగుళములుగల Anglers 180 3 అం. ×9 అ. గల బద్దెలు. 90, Bolts, Nuts etc. పెద్దు సైజు 120×50×20 అ. లు. ఒకొక్క పెద్దుయొక్క ఇనుప సామాను రమారమి 30 టన్నులుండును.

ఈ అమ్మకమునకు సంబంధించిన వ్రాతలు పరిష్కారములు 10-4-47 లోపున జరుగవలెను. వివరములకు :

గుడిమెట్ల బ్రదర్సు, కాకినాడ.



మంగరోగాలకు మావద్ద గ్యారంటీ రికిత్సపొందుడు వివరములకు: యస్. నుబ్బారెడ్డి అండ్ కో., గోవాలపురం, తూర్పుగోదావరి (Via) తణుకు. M. S M.

మనవంటి వ్యక్తులకు.



ప్రపంచం మీద సవాలు



ఆటలలో ఇండియా చాలా అభివృద్ధికి వచ్చింది. ఆ విషయంలో ప్రపంచంమీద సవాలు చేస్తున్నది, అందువల్ల, ఇండియా ఆటగాండ్రు తమ కండలను క్రొత్త రీతులలో బలపరచుకొంటున్నారు వారికి ముఖ్యంగా అవసరమైనవి వారిశిక్షణ, సమర్థులయినవారు పట్టుదలతో యిచ్చే తర్బీతులు; వీటికన్నా యెక్కువగా విశ్రాంతి, వినోదము కావాలి. వారికి టీ ఆదర్శప్రాయమైన పానీయము. అది దేహానికి ఉత్తేజం కలిగిస్తుంది, మనస్సుకు ఉల్లాసం ఇస్తుంది. కఠినమైన శిక్షణ పొందటం సాధ్యమయ్యేటట్లు చేస్తుంది. అందువల్ల, దిట్టరులైన మన ఆటగాండ్రు అనేకమంది టీని తమ తోడునీడగా, స్నేహితుణ్ణిగా ఎంచుకొంటారు.

టీ నిర్వహణశక్తికి

ఇండియన్ టీ మార్కెట్ ఎక్స్పాన్షన్ బోర్డువారి ప్రకటన



విష్ణు

అంటే అర్థం యంబిటో

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty Street, G. T., Madras